RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 91 బుధవారం, మే 8, 2024 పేజీలు : 4

## కర్నాటక బిజెపి యానిమేషన్ వీడియోను తీసేయాలని ఈసి ఎక్స్ ని ఆదేశించింది

న్యూఢిల్లీ: ముస్లిం రిజర్వేషన్లపై కర్ణాటక బిజెపి షేర్ చేసిన యానిమేషన్ వీడియోను తీసివేయాలని ఎన్నికల సంఘం 'ఎక్స్'(గతంలో ట్విట్టర్ అని పిలిచేవారు)ని ఆదేశించినట్లు వార్తా సంస్థ పిటిఐ మంగళవారం పేర్కొంది. మే 4న, కాంగ్రెస్‌పై దాడి చేయడానికి ముస్లిం వ్యతిరేక వాక్చాతుర్యంతో రిజర్వేషన్లపై యానిమేషన్ వీడియోను కర్ణాటక బిజెపి పోస్ట్ చేసింది, రిజర్వేషన్లలో ఎస్సీ, ఎస్టీ , ఓబిసిల వాటాను ముస్లింలకు కాంగ్రెస్ ఇస్తుందని సూచించింది.

# నేను ముస్లింలకు.... వ్యతిరేకం కాదు



న్యూఢిల్లీ : ఇస్లాంను, ముస్లింలను తాను వ్యతిరేకించనని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికల పోరు వాడిగా వేడిగా సాగుతున్న తరుణంలో ఒక జాతీయ మీడియాతో మాట్లాడిన సందర్భంలో ప్రధాని మోడీ ఆ మాట అన్నారు. 'అది మా విధానం కాదు. నెహ్రూ కాలం నుంచే వారు (ప్రతిపక్షాలను ఉద్దేశించి) ఈ కథనాలు ప్రచారం చేస్తున్నారు. ముస్లిం వ్యతిరేకులు అని మాపై ఆరోపణలు చేస్తున్నారు. దాని నుంచి లబ్ధి పొందాలన్నది వారి ధ్యేయం. మమ్మల్ని వ్యతిరేకులుగా చూపించి తాము వారికి స్నేహితులమని అంటూ కపట ప్రేమ ప్రదర్శిస్తారు. కానీ ముస్లిం సమాజం చైతన్యవంతంగా మారింది. ట్రిపుల్ తలాక్ రద్దు చేసినప్పుడు వారి ఆందోళనపై నేను నిజాయతీగా ఉన్నానని ముస్లిం సోదరీమణులు భావించారు. ఆయుష్మాన్ కార్డులు ఇచ్చినప్పుడు, కొవిడ్ వ్యాక్సిన్లు అందుబాటులోకి తెచ్చినప్పుడు వారు అదే విధంగా భావించారు. నేను ఎవరిపైనా వివక్ష చూపడం లేదని వారు అర్థం చేసుకున్నారు. ప్రతిపక్షాల అబద్ధాలు బహిర్గతం అయ్యాయి. అదే వారి బాధ. అందుకే తప్పుదోవ పట్టించేందుకు రకరకాల అబద్ధాలు చెబుతూనే ఉంటారు' అని మోడీ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు.

ప్రధాని మోడీ కొన్ని రోజుల క్రితం ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ, కాంగ్రెస్ కనుక కేంద్రంలో అధికారంలోకి వచ్చినట్లయితే ప్రజల సంపద అంతా మైనారిటీలు అయిన ముస్లింలకు పంచుతుందని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. 'ప్రజల వద్ద ఉన్న బంగారంతో సహా సంపద మొత్తం సర్వే చేసి అందరికీ సమానంగా తిరిగి పంపిణీ చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో సూచించింది.




## బీజేపీ గెలిస్తే పెట్రోల్, డీజిల్ ధరలు... 400 దాటుతాయ్

**కామారెడ్డి:** అబ్ కీ బార్ చార్ సౌ పార్ అని బీజేపోళ్లు గ్యాస్ చెబుతున్నారని.. కేంద్రంలో మళ్లీ బీజేపీ గెలిస్తే పెట్రోల్, డీజిల్ ధరలు 400 అవుతుందని బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అన్నారు. ఇందులో అనుమానమే అవసరమే లేదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జహీరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని కామారెడ్డి నియోజకవర్గంలో కేసీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. ఈ దేశం మనది, రాష్ట్రం మనది, దయచేసి ఆలోచించి ఓటు వేయాలని యువతను విజ్ఞప్తి చేశారు. ఈసారి కేంద్రంలో రాబోయేది సంకీర్ణ ప్రభుత్వమే అని తెలిపారు. బీజేపీకి 200 సీట్లు కూడా రావని పేర్కొన్నారు. ' మనం ఇచ్చిన కరెంటు పోయింది.. మంచినీళ్లు పోయినయ్.. రైతుబంధు పోయింది.. రైతుబీమా కూడా ఉంటదో పోతదో తెలియదు.. నిరుద్యోగులకు 4 వేల నిరుద్యోగ భృతి అన్నారు.. యువ వికాసం అని 5 లక్షలు బ్యాంక్ కార్డు ఇస్తామని అన్నారు? ఏ విద్యార్థికైనా ఇచ్చారా? ఇవన్నీ ఇయ్యకపోతే ఇయ్యకపోయారు.. మన గవర్నమెంట్ ఉన్నప్పుడు ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వట్లేదు. సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ 1100 పెట్టినం.. వాటిని జూనియర్ కాలేజీలు చేసినం.. అక్కడ పిల్లలకు అన్నం కూడా సరిగ్గా పెడతలేరు.. 125 స్కూళ్లలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు ఆస్పత్రి పాలవుతున్నారు.' అని కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో అసలేం జరగుతుందని ప్రశ్నించారు. 5 నెలల్లో ఇంత ఆగమాగం ఉంటదా? అని నిలదీశారు. కేసీఆర్ పోగానే కట్క బంద్ చేసినట్టే కరెంటు బంద్ అయితదా? నల్లాలు బంద్ అయితయా? రైతుబంధు బంద్ అయితదా? అని ప్రశ్నించారు.

డబ్బులన్నీ ఎక్కడికి పోతున్నాయ్.. ఏం జరుగుతుందనేది దయచేసి ఆలోచన చేయాలని ప్రజలకు సూచించారు. కామారెడ్డి జిల్లా చాలా చైతన్యం ఉన్న గడ్డ.. తెలంగాణ ఉద్యమంలో బ్రహ్మాండమైన పోరాటం చేసిన గడ్డ అని కేసీఆర్ పేర్కొన్నారు. ఇదే కామారెడ్డి పట్టణంలో పోలీసు కిష్టయ్య పిస్టోల్‌తో కాల్చుకుని అమరుడయ్యారని గుర్తు చేశారు. ఆనాడు చాలా కష్టపడి, అనేక సంవత్సరాలు పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నాం.. పొదరిల్లులా చేసుకున్నాం.. వ్యవసాయం బాగా చేసుకున్నాం.. పేద, ముసలి వాళ్లకు 2 వేల పింఛన్ ఇచ్చుకున్నాం.. బీడీ కార్మికులకు దేశంలో ఎక్కడా ఇవ్వనట్టుగా రెండు వేల పింఛన్ ఇచ్చుకున్నాం అని తెలిపారు.


## ప్రజ్వల్ రేవణ్ణను దేశం దాటించి... మాలాంటి వారిని అరెస్టు చేయడం అన్యాయం

న్యూఢిల్లీ : ప్రజ్వల్ రేవణ్ణ వంటి వారిని దేశం దాటించారు.. మాలాంటి వారిని అరెస్టు చేయడం చాలా అన్యాయం అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. ఈ విషయం అందరూ గమనించాలని కోరుతున్నానని కవిత సూచించారు. మంగళవారంతో కవితకు జ్యుడిషియల్ కస్టడీ ముగియడంతో ఆమెను ఇవాళ కోర్టులో హాజరు పరిచారు. కవితకు ఈ నెల 14వ తేదీ దాకా జ్యుడిషియల్ కస్టడీ పొడిగించింది కోర్టు. ఈ సందర్భంగా కవిత కోర్టు హాలు నుంచి బయటకు వస్తూ పై వ్యాఖ్యలు చేశారు.



## కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై ... తీర్పు వాయిదా

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మంగళవారం సుప్రీంకోర్టు ఉపశమనం లభించలేదు. మధ్యంతర బెయిల్ కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను వచ్చే గురువారం(మే 9) కాని వచ్చే వారం కాని ముగిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. కాగా..పిటిషన్ విచారణ సందర్భంగా కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చిన పక్షంలో ఆయన అధికారికి ఫైళ్లపై ఎటువంటి సంతకాలు చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2022 గోవా ఎన్నికల సందర్భంగా కేజ్రీవాల్ ఒక సెవన్ స్టార్ హొటల్‌లో బసచేశారని, ఆయన బిల్లులో కొంత భాగాన్ని ఢిల్లీ ప్రభుత్వానికి చెందిన సాధారణ పరిపాలన శాఖ భరించిందని ఇడి తెలియచేసింది. బెయిల్‌పై విడుదలైన తర్వాత కేజ్రీవాల్ ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన ఫైళ్లను చూడరని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించగా ఆయన అధికారిక బాధ్యతలేవీ చూడకూడదని తాము చెబుతున్నామని కోర్టు స్పష్టం చేసింది.




అప్రూవర్ల వాంగ్మూలాలను ఇడి తొక్కిపెట్టిందంటూ కేజ్రీవాల్ చేసిన వాదనను ఇడి తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు తోసిపుచ్చుతూ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనంకు ఒక నోట్ అందచేశారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆప్ అధినేత అయిన కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసే విషయాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం ఇదివరకు సూచించింది. అయితే ఈ సూచనను ఇడి నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ఇది ప్రజలలో తప్పుడు సంకేతాలు పంపుతుందని ఇడి తెలిపింది. ఆయన ఢిల్లీ ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి. ఎన్నికలు ఉన్నాయి. ఇవి అసాధారణ పరిస్థితులు. ఆయన స్వాభావికంగా నేరస్థుడు కారు అని ధర్మాసనం తెలిపింది.


బెయిల్‌పై విడుదల చేస్తే ఆయనను ముఖ్యమంత్రి విధులను

## పవన్‌ను గెలిపించండి: చిరంజీవి

ఏపీలో ఎన్నికలకు వారం రోజుల వ్యవధి కూడా లేదు. అన్ని పార్టీలు విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నాయి.



అధికార వైసీపీని గద్దె దించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా పోటీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తన తమ్ముడు, జనసేనాని పవన్ కల్యాణ్ కు మద్దతుగా మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా వీడియో సందేశాన్ని ఇచ్చారు. జనసేనానిని గెలిపించాలని వీడియోలో ఆయన కోరారు. తమ ఇంట్లో ఆఖరివాడైనా ప్రజలకు మంచి చేయడంలో పవన్ ముందు ఉంటారని అన్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినా ప్రజలకు మంచి చేయాలని కోరుకుంటాడన్నారు. తన తమ్ముడు పడుతున్న అవస్థలు చూస్తుంటే బాధేస్తుందన్నారు. "కొణిదెల పవన్ కల్యాణ్, అమ్మ కడుపున ఆఖరి వాడిగా పుట్టినా... అందరికీ మంచి చేయాలి, మేలు జరగాలి అనే విషయంలో ముందు వాడిగా ఉంటాడు. తన గురించి కంటే జనం గురించి ఎక్కువగా ఆలోచించే మనస్తత్వం మా తమ్ముడు కల్యాణ్ బాబుది. ఎవరైనా అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఏదైనా చేయాలనుకుంటారు. కానీ కల్యాణ్, తన సొంత సంపాదనను కౌలు రైతుల కన్నీళ్లు తుడిచేందుకు ఖర్చు పెట్టడం, సరిహద్దు వద్ద ప్రాణాలను ఒడ్డి పోరాడే జవాన్ల కోసం పెద్ద మొత్తం అందివ్వడం ఇలా ఎన్నెన్నో. ఆయన చేసిన పనులు చూస్తుంటే ఇలాంటి నాయకుడు కదా జనాలకు కావాల్సింది అనిపిస్తుంటుంది.




## రైతు బంధు నిధుల విడుదలకు ఎన్నికల సంఘం బ్రేక్

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కారుకు ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. రైతు బందు నిధుల విడుదలపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ తర్వాత నిధులు విడుదల చేయాలని స్పష్టం చేసింది. రైతు బంధు విషయంలో ఎన్నికల కమిషన్‌కు ఎన్ వేణుకుమార్ ఫిర్యాదు చేశారు. రైతు బంధు చెల్లింపులపై రేవంత్ వ్యాఖ్యలపై ఆయన ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఫిర్యాదును పరిశీలించిన ఎన్నికల కమిషన్ సీఎం రేవంత్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని పేర్కొంది. ఎన్నికలు జరుగుతున్న వేళ బహిరంగంగా ఈ నెల తొమ్మిదిలోగా అయిదు ఎకరాల రైతులకు రైతు బంధు నిధులు వారి ఖాతాలలో జమ చేస్తామని ప్రకటించడం కోడ్ ఉల్లంఘనేనంటూ నిధులు విడుదలను ఆపాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని ఆదేశించింది ఎన్నికల కమిషన్.

## కోట్లాదిమందిని.... లక్షాధికారులను చేస్తాం

చైబస: గిరిజనులకు చెందిన జల్(నీళ్లు), జంగల్(అడవులు), జమీన్(భూమి)ను పారిశ్రామికవేత్తలకు అప్పగించాలని ప్రధాని నరేంద్ర మోడీ భావిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం ఆరోపించారు. జార్ఖండ్‌లోని చైబసలో ఒక ఎన్నికల ప్రచార సభనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ తమ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే కోట్లాదిమంది ప్రజలను లక్షాధికారులను చేస్తానని వాగ్దానం చేశారు. రాజ్యాంగాన్ని, గిరిజనులు, పేదలు, వెనుకబడిన వరాగల హక్కులను రక్షించేందుకే ఈ లోక్‌సభ ఎన్నికలని ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు తమ ప్రాణాలను త్యాగం చేయడానికి సైతం ఇండియా కూటమి నాయకులు సిద్ధమని ఆయన ప్రకటించారు. గిరిజనులకు చెందిన జల్, జంగల్, జమీన్‌ను 14-15 మంది పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ భావిస్తున్నారని ఆయన ఆరోపించారు. తన 10




సంవత్సరాల పాలనలో ఆయన కేవలం 22 మందిని మాత్రమే కోటీశ్వరులను చేశారని రాహుల్ తెలిపారు. అయితే తాము అధికారంలోకి వస్తే కోట్లాదిమందిని లక్షాధికారులను చేస్తామని, పేద మహిళలకు ఏటా రూ. 1 లక్ష అందచేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## సంపాదకీయం

# చిచ్చుమాటల వెనుక చర్చనీయాంశాలు

ప్రచారం అన్న మాట వినడానికి ఎంతో పవిత్రంగా, అమాయకంగా కనిపిస్తుంది. ఇప్పుడు వ్యాపిస్తున్న మాటల కాలుష్యాన్ని ఎన్నికల ప్రచారం అనడం చాలా అన్యాయం. ఒకరిని లేదా ఒక విషయాన్ని పైకెత్తడానికి గానీ, కిందికి తోసేయడానికి కానీ, నిజాలను కానీ, వదంతులనుకానీ, అబద్ధాలని కానీ ప్రచారంచేయడాన్ని ఇంగ్లీషులో ప్రాపగాండా అంటారు. ఊదరగొట్టడం అంటే దగ్గరగా ఉంటుంది. ఈ కళలో ఆరితేరిన, పేరువోసిన వారు చరిత్రలోను, వర్తమానంలోనూ అనేకు లున్నారు. అటువంటి ఒక ఘనాపాటి ప్రకారం, బాగా ప్రభావం వేసే వాదనలను పదే పదే వినిపించడమే ఈ ఊదరకళకు ఊపిరి. అట్లాగని, మెత్తగా, గంభీరంగా ఉండే మాటలు మాట్లాడితే ఉపయోగం లేదు. మనం మాట్లాడేది మేధావుల కోసం కాదు. మేధావులను మనం మార్చలేం, మార్చక్కరలేదు కూడా, కాస్త నోరుపెంచామంటే వాళ్లే లొంగిపోతారు. మనం గురిపెట్టాల్సింది రోడ్లమీద కనిపించే అతి సామాన్యుడిని. మన వాదనలు బాగా మొరటుగా ఉండాలి, సులువుగా అర్థం కావాలి, చాలా పదునుగా ఉండాలి. వాడి బుర్రకి కాదు, మనసుకి, ఆవేశాలకి, సహజాతాలకి తాకేటట్టు మాట్లాడాలి. సత్యం మాట్లాడాలని పట్టింపు అక్కరలేదు. మన ఎత్తుగడలకు, మానసిక తంత్రానికి ఉపయోగపడకపోతే, నిజాలతో మనకు పనిలేదు. నమ్మదగినట్టుగా అబద్ధాలు మాట్లాడాలి. అతని కంటె ఘనుడు ఆచంట మల్లన్న ఏమన్నాడంటే, చిన్నాచితకా అబద్ధాల వల్ల ఉపయోగం లేదు. అటువంటివి అందరూ మాట్లాడతారు. పెద్ద, అతి పెద్ద, భారీ అబద్ధం ఆడాలి, దాన్ని పదే పదే వల్లె వేయాలి. అబద్ధం మీద ఆధారపడే పాలనలో, సత్యమే రాజ్యానికి అతి బద్ధశత్రువు. ఈ ఊదర అసత్యవాదం ఎన్నికల సమయంలోనే వ్యాపించి ఉంటుందనుకుంటే పొరపాటు. ప్రచారం లేకుండా ప్రభుత్వాలే ఉండవు. ప్రజలకెప్పుడూ ఏదో నూరిపోయకుండా పాలకులకు గడవదు. లాక్కుని పంచేస్తారు, వాళ్లది తీసుకుని వీళ్లకు ఇచ్చేస్తారు, మంగళసూత్రాలు ఎత్తుకుపోతారు, వంటి ప్రచారానికి చప్పట్లు ఎక్కువ పడుతున్నాయో, అంతకు మించి మరో కొత్తమంత్రం దొరకలేదో ప్రధానమంత్రి, ఆయన సహచరులు రెండో దశ పోలింగ్ తరువాత కూడా అదే హోరును మరింత జోరుతో సాగిస్తున్నారు. కాంగ్రెస్ వాళ్లు కూడా ఏమీ తక్కువ తినలేదు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారు దగ్గర మొదలైన హెచ్చరిక, రిజర్వేషన్లు అన్నీ రద్దు చేస్తారు దాకా విస్తరించింది. సాధారణంగా ఎన్నికల ప్రచారాల్లో తాము అధికారంలోకి వస్తే అది ఇస్తాం, ఇది ఇస్తాం, వాళ్ల కంటె ఎక్కువ మేం ఇస్తాం, వంటి అంశాలను మాట్లాడతారు. అంటే, ప్రధానంగా ఇవ్వడం గురించి మాట్లాడతారు. ఇప్పుడు లాక్కోవడం, తీసేసుకోవడం అన్న అంశాల గురించి మాట్లాడుతున్నారు. అవతలివాళ్లు అధి కారంలోకి వచ్చారో, ఉన్నది కోల్పోతారు అని భయపెడు తున్నారు. ప్రత్యర్థుల బూచీకరణ ఈ సారి ఎన్నికలలో ఒక విశేషం. ఉభయపక్షాలు, పరస్పరం చేసుకుంటున్న నిందా రోపణల ప్రాతిపదిక మీదనే ఈ భయప్రచారం సాగుతున్నది. ప్రజల సంపదనంతా తీసుకుని, పునఃపంపిణీ చేస్తుందని, ప్రధానంగా ముస్లిములకు బట్వాడా చేస్తుందని మోదీ చేస్తున్న ప్రచారం ఆశ్చర్యకరమైనది, బలహీనమైన ఆధారాలకు విచిత్రమైన అన్వయాలను ఇవ్వడం ద్వారా నిర్మించిన వాదన అది. ప్రధానమంత్రి స్థాయి వ్యక్తి అట్లా మాట్లాడడం ఇప్పటికీ మింగుడుపడని వారున్నారు. కానీ మొరటు మాటలను పదే పదే వల్లించడంలో కలిగే సదుపాయం వేరు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే, రాజ్యాంగాన్ని మౌలికంగా మార్చేస్తారని, ప్రజాస్వామ్యం పూర్తిగా బలహీనపడుతుందని, ఇకపైన ఎన్నికలే ఉండవని కాంగ్రెస్ చాలా కాలంగా అంటున్నది. బీజేపీ రెండుదఫాల పాలన ఆధారంగా, ఆ పార్టీ సామాజిక విశ్వాసాల ఆధారంగా చేస్తున్న భవిష్యత్ అంచనా అది. రాజకీయసైద్ధాంతిక అంచనా. రోడ్డుమీది సామాన్యుడికి కూడా అందడానికి వీలుగా, మొత్తంగా రిజర్వేషన్లే రద్దు అవుతాయని ఆ వాదనను మెరుగుపరిచి, కాంగ్రెస్ ప్రచారంలో పెట్టింది. అధికారం కోల్పోతామేమోనన్న భయమో, అధికారం దక్కించుకోవాలన్న ప్రయత్నమో, పార్టీల చేత ఉద్వేగపూరితమైన అధమస్థాయి ప్రచారానికి ప్రేరేపిస్తూ ఉండవచ్చు. ప్రజలు ఇంతకంటె మెరుగైన అంశాలను, తమ మనుగడకు సంబంధించిన సామాజికార్థిక అంశాలను ఎన్నికల సందర్భంలో చర్చించాలని ఆశిస్తారన్నది నిజమే. అట్లాగని రిజర్వేషన్ల అంశం, రాజ్యాంగాన్ని కాపాడు కోవడం ప్రజలకు సంబంధించని అంశాలేమీ కాదు. కానీ, ముస్లిమ్ రిజర్వేషన్ల అంశం ఆవేశకావేశాలు రగిలించే రీతిలో ఇంత ప్రాధాన్యం ఇవ్వవలసిన అంశమా? ప్రాధాన్యం ఇస్తే, సచార్ కమిషన్ సిఫారసుల ప్రకారం న్యాయమైన సానుకూల చర్యలను పార్టీలు ప్రతిపాదించాలి. కానీ జరుగుతున్నదేమిటి? ముస్లిములందరికీ రిజర్వేషన్లు కల్పించే కర్ణాటక నమూనాను విమర్శించడంలో ఒక వాదన ఉన్నది. మొత్తంగా ఒక మతవర్గానికి రిజర్వేషన్లు కల్పించడం మతప్రాతిపదిక రిజర్వేషన్లు అవుతాయి. మరి తెలంగాణలో కూడా ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని అంటున్నారు. తెలంగాణలో ముస్లిములలోని కొన్ని వెనుకబడిన శ్రేణులకు వెనుకబడిన తరగతులలో భాగంగా రిజర్వేషన్లు ఇస్తున్నారు. మరి అవి మతప్రాతిపదిక రిజర్వేషన్లు కావే? మరి ప్రధానమంత్రి వాదన మతప్రాతిపదిక రిజర్వేషన్లకు వ్యతిరేకంగానా? ముస్లిములకు వ్యతిరేకంగానా? ఈ చర్చ అంతా ఒక విభజన వాతావరణానికి ఆస్కారం ఇచ్చి, ఉద్వేగాల మీదికి దారిమళ్లిస్తుంది. దేశవనరుల మీద మొదటి హక్కు అట్టడుగు వర్గాలకు ఉంటుందన్నది అందరూ అంగీకరించవలసిన అంశం. మన్మోహన్ సింగ్ అన్నమాటలను ఇవాళ తప్పుపడుతున్నది కానీ, ఇరవయ్యేళ్ల నుంచి బీజేపీ సిద్ధాంతంగాను, పదేళ్లుగా ప్రభుత్వ విధానాల్లో ఒకటిగాను ఉన్న 'అంత్యోదయ' అర్థం ఏమిటి? చిట్టచివరన ఉన్నవారికి కూడా అభివృద్ధిఫలాలు అందడమే కదా? ఆ అట్టడుగు వర్గాలలో ముస్లిములు ఉండకూడదంటే, వారిలో వెనుకబాటు లేదని శాస్త్రీయంగా నిరూపించాలి.

## రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు



**శామీర్ పేట, (గరుడ వార్త) :** బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తాళ్ల జగదీష్ గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం శామీర్ పేట, అలియాబాద్ గ్రామాల్లో మల్కాజ్గిరి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం ఆయా గ్రామాల కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ గౌడ్ మాట్లాడుతూ... బిఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి పతంలో ముందుకు సాగిందని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని జగదీష్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తానన్న హామీల్లో ఒకటి కూడా సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలోని గ్రామాలు, పల్లెలు, పట్టణాలు బిఆర్ఎస్ ప్రభుత్వం కెసిఆర్ సారాధ్యంలోనే అభివృద్ధి చెబుతాయని ప్రజలు భావిస్తున్నారన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డి ని గెలిపిస్తే మన నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తారని అన్నారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగ వెంకట్ రెడ్డి, బాబు, భూమి రెడ్డి, వెంకటేష్, సత్యనారాయణ, రవి, శేఖర్, అంజిరెడ్డి, మధు, ప్రభాకర్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వైభవంగా మాస శివరాత్రి పూజలు





**శామీర్ పేట, (గరుడ వార్త) :** ఘనంగా వైభవంగా మాస శివరాత్రి పూజలను నిర్వహించారు. సోమవారం రాత్రి మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో (శివాలయం) ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో రామకృష్ణ శర్మ స్వామివారికి రుద్రాభిషేకం, అర్చన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. శామీర్ పేటకు చెందిన భజన మండలి ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపించారు. భక్తుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

## సునీత మహేందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు




**శామీర్ పేట, (గరుడ వార్త) :** కాంగ్రెస్ పార్టీ చేసిన హామీలపై ప్రజలకు సంపూర్ణ నమ్మకం ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితోనే కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే కేవలం మూడు నెలల్లోనే ఐదు గ్యారంటీలను అమలు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటు వేసి సునీత మహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఇంటింటికి తిరుగుతూ సునీతమహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్ రెడ్డి సుపరిచితురాలని, మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్ రెడ్డి ని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ





**శామీర్ పేట, (గరుడ వార్త) :** శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శామీర్ పేట గ్రామానికి చెందిన గుల్యగారి బాలరాజ్ గౌడ్- అమృత దంపతులు, వారి కుటుంబ సభ్యులు, శామీర్ పేట గ్రామానికి చెందిన దేవి శివ వరప్రసాద్ జన్మదినం సందర్భంగా ధోనే పూడి అర్జున్ రావు-సత్యవతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు, అర్కేలగూడెం కు చెందిన కార్తీక్ గౌడ్ జన్మదినం సందర్భంగా రాంపల్లి గణేష్ గౌడ్-నాగమణి దంపతులు వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## ఇంటింటి ప్రచారంలో బిజెపి నాయకులు



**శామీర్‌పేట, (గరుడ వార్త):** శామీర్పేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంగళవారం ఉమ్మడి మండలంలోని గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ భారీ మెజారిటీతో తెలుపు పొందుతారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారుడు, మచ్చలేని మహా నాయకుడు ఈటెల రాజేందర్ అని , అందరి ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో గెలువబోతున్నారని చెప్పారు. ప్రస్తుతం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బీజేపీ గాలి వీస్తోందని, ప్రజలంతా బీజేపీకి పట్టం కట్టెందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. దేశంలో కుల, మత, పేద, ధనిక, లింగ ప్రాంతీయత అనే భేదం లేకుండా ముచ్చటగా మూడోసారి దేశ ప్రధానిగా నరేంద్ర మోడీని చూడాలని ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. మినీ ఇండియాగా పిలవబడే అతి పెద్దదైన మల్కాజిగిరి పార్లమెంట్ బరి నుంచి పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మావోయిస్టుల ఐఈడీని నిర్వీర్యం చేసిన పోలీసులు

**బీజాపూర్:** గడ్చిరోలి పోలీసులు మావోయిస్టులు డంప్ చేసిన ఐఈడీని ధ్వంసం చేసారు. ఐఈడీ ఆ దాడులకు ప్లాన్లో ఉన్న మావోయిస్టులు కొన్ని పేలుడు పదార్థాలు మరియు క్లేమోర్ మైన్లను టిపగడ్ ప్రాంతంలో గుర్తించారు. పోలీసులను టార్గెట్ గా వీటిని ఉపయోగించడానికి తయారు చేసారు. విశ్వసనీయ సమాచార మేరకు ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చేసారు. భారీ స్థాయిలో భద్రతా బలగాలను కూంబింగ్ జరిపారు. పోలీసుల కూంబింగ్ సమయంలో మావోయిస్టులు ఈ క్లైమోర్లు / పేలుడు పదార్థాలను ఉపయోగించడం సాధ్యపడలేదు.

# 10 సీట్లు బీఆర్ఎస్‌కు ఇస్తే.. ఆరు నెలల్లో కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారు : కేటీఆర్

**సికింద్రాబాద్:** తెలంగాణ కోసం పేగులు తెగే దాకా కొట్లాడే బీఆర్ఎస్ పార్టీ ఒక దిక్కు ఉంటే.. కుర్ కురే బీజేపీ పార్టీ ఒక దిక్కు, కిరికిరి కాంగ్రెస్ పార్టీ ఇంకో దిక్కు ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కుర్‌కురే పార్టీకి, కిరికిరి పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు. సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అంబర్‌పేటలో నిర్వహించిన రోడ్ షోలో కేటీఆర్ పాల్గొన్నారు.

**గులాబీ జెండానే తెలంగాణకు శ్రీరామరక్ష**

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. జూన్ 2 తర్వాత బీజేపోళ్ల కచ్చితంగా హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం మార్చేస్తారని అన్నారు. హైదరాబాద్ మీద వాళ్లకు పట్టుదొరకట్లేదని.. అందుకే ఢిల్లీని చేసినట్లు హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. దాన్ని అడ్డుకోవాలంటే బీఆర్ఎస్ పార్లమెంట్‌లో కచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇవి ప్రధాని ఎన్నికలు కదా? బీఆర్ఎస్ గెలుసుడు ఏమీ అవసరమని కొందరంటున్నారని తెలిపారు. గతంలో కూడా ఇట్లనే మాట్లాడారని. కానీ ఐదుగురు ఎంపీలతో కేసీఆర్ తెలంగాణ తెచ్చారని గుర్తుచేశారు. ఢిల్లీ మెడలు, కాంగ్రెస్ మెడలు వంచేది కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణకు గులాబీ జెండానే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.

**400 సీట్లు కాదు.. బీజేపీ గెలిస్తే పెట్రోల్ ధర 400 అవుతుంది**

ఐదేళ్లలో కిషన్ రెడ్డి అంబర్‌పేటకు ఒక్క రూపాయి అయినా తెచ్చిండా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఒక్క గుడి కట్టిండా, బడి కట్టిండా? ఆయనకు ఎందుకు ఓటు వేయాలని నిలదీశారు. ఈ సారి బీజేపీ 400 సీట్లు అంటోంది. మళ్లీ బీజేపీకి ఓటు వేస్తే పెట్రోల్, డిజీల్ ధరలు రూ. 400 అవుతుందని.. సిలిండర్ ధరను ఐదు వేలు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. మీకు ఓటు ఎందుకు వేయాలని అడిగితే మేము గుడికట్టినం అని అంటున్నారని..మరి కేసీఆర్ యాదాద్రి కట్టలేదా అని ప్రశ్నించారు. ఒక్క యాదాద్రి మాత్రమే కాదు.. ఆధునిక దేవాలయాలైన కాళేశ్వరం సహా ఎన్నో రిజర్వాయర్లు కట్టిండని తెలిపారు. గుడి కట్టుడే కారణమైతే కేసీఆర్‌కు ఎన్ని ఓట్లు వేయాలని ప్రశ్నించారు. సికింద్రాబాద్‌లో బీజేపోళ్లే కిషన్ రెడ్డి హటావో.. సికింద్రాబాద్ బచావో అంటున్నారని కేటీఆర్ తెలిపారు. ఇక్కడ 2014, 2018 లో బీజేపోళ్లను ఓడించింది బీఆర్ఎస్సే అని గుర్తుచేశారు. బీజేపీ తీస్ మార్ ఖాన్లు అని చెప్పుకునేటోళ్లను కూడా 2023లో బీఆర్ఎస్సే ఓడించిందని తెలిపారు.



**బీజేపీతో దోస్తీ ఉంటే మా చెల్లె జైల్లో ఉండేదా?**

కాంగ్రెసోళ్లు సిగ్గులేకుండా బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అంటూ ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మా చెల్లెలు, కేసీఆర్ కుమార్తె 50 రోజులుగా జైల్లో ఉంది.. బీజేపీతో మాకు దోస్తీ ఉంటే మా చెల్లెలు జైల్లో ఉండేదా? అని అడిగారు. 2014 లో బడేభాయ్.. 2023 లో చోటా భాయ్ మోసం చేసిండని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపిస్తే జిల్లాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు నమ్మి మోసపోయారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి సిగ్గు లేకుండా అబద్దాలు చెప్పుకుంటూ తిరుగుతున్నాడని విమర్శించారు. ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలు అమలైనయ్ అంటూ రేవంత్ రెడ్డి హోర్డింగ్‌లు పెట్టుకున్నాడని మండిపడ్డారు. ఆడబిడ్డలకు లక్షన్నర తులాల బంగారం బాకీ ఉన్నావ్.. ఇయ్యకపోతే నీ లగ్గం చేస్తారని మండిపడ్డారు.

**రేవంత్ రెడ్డి మాట్లాడుతుంటే ఫ్యామిలీతో చూడలేం**

మహిళలకు రూ. 2500 చొప్పున ఇచ్చామని రాహుల్ గాంధీ చెబుతున్నాడని.. మరి వచ్చినయా అని కేటీఆర్ ప్రశ్నించారు. వృద్ధులకు రూ. 4 వేలు అన్నాడు.. ఉన్న 2 వేలు కూడా ఎగగొట్టిండని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతుంటే టీవీల ముందు ఫ్యామిలీతో చూసే పరిస్థితి లేదని పేర్కొన్నారు. నేను లంకెబిందెలు ఉన్నాయనుకొని వచ్చినా అంటాడు. దొంగలు కదా లంకెబిందెల కోసం తిరిగేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి గలీజ్ మాటలు మాట్లాడుతున్నాడని.. పేగులను మెడల వేసుకుంటా అంటున్నాడని.. జేబుల కత్తెర పెట్టుకొని తిరుగుతా అంటున్నాడని మండిపడ్డారు. ముఖ్యమంత్రి జేబులా కత్తెర పెట్టుకొని తిరుగుతాడా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# భారీగా పెరుగుతున్న అద్దెలు



హైదరాబాద్: వేగవంతంగా పెరిగిపోతున్న నగరాలలో హైదరాబాద్ ఒకటి. నగరం నాలుగు దిశలలో డెవలప్ మెంట్ పరుగులు తీస్తోంది. ఇక్కడ అన్ని ప్రాంతాల వారూ ఉండదగిన వాతావరణం ఉండటం ప్లస్ పాయింట్. పెరిగిపోతున్న జనాభాకు అనుగుణంగా మెరుగైన రవాణా సౌకర్యాలు ఉండటం మరో ప్లస్ పాయింట్. అయితే ఎక్కడ నుంచే ఉద్యగోలు, వ్యాపారాల కోసం వలస వస్తుంటారు నగరానికి వచ్చీ రాగానే వాళ్లు ముందుగా సొంతింటి కన్నా అద్దె ఇల్లు అందుబాటుల ఎక్కడ ఉంటుందా అని వెదుకుతారు. విద్యాసంస్థలు, ఉద్యోగ శిక్షణ సంస్థలు, సాఫ్ట్ వేర్ కంపెనీలు ఇబ్బడిముబ్బడిగా ఉ ండటంతో సమీప ప్రాంతాలలో అద్దెలు విపరీతంగా పెరిగిపోయాయి. గత నాలుగేళ్లలో గృహాల అద్దెలు గణనీయంగా పెరిగాయి. నెలవారీ సగటు అద్దెలు కొవిడ్ ముందుతో పోలిస్తే ఎనిమిది ప్రధాన నగరాల్లో 25 నుంచి 30 శాతం పెరిగాయని రియల్ ఎస్టేట్ టెక్ ఫ్లాట్‌ఫాం హౌసింగ్.కామ్ తాజాగా ఇచ్చిన నివేదికలో వెల్లడించింది. హైదరాబాద్ మార్కెట్‌లో 25 శాతం పెరిగాయి. మూలధన విలువల పెరుగుదల కంటే నెలవారీ నగటు అద్దె వృద్ధి ఎక్కువగా ఉందని వెల్లడించింది.దేశీయ ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులను తప్పనిసరిగా కార్యాలయానికి వచ్చి పనిచేయాల్సిందిగా ఆదేశించడంతో అద్దె ఇళ్లకు డిమాండ్ పెరిగింది. బహుళజాతి కంపెనీలు హైబ్రిడ్ మోడల్ అనుసరిస్తున్నప్పటికీ సిటీలో నివాసం అనివార్యంగా మారింది. దీంతో కొవిడ్ సమయంలో ఖాళీ అయిన నివాసాలన్నీ తిరిగి భర్తీ కావడమే కాదు.. గత రెండేళ్లలో కొత్త ఉద్యోగుల రాకతో డిమాండ్ పెరిగింది. ఇవన్నీ కూడా అద్దెల ధరలు పెరగడానికి దోహదం చేశాయి. స్థిరాస్తుల ధరలు పెరగడం కూడా : కొవిడ్ అనంతరం ఇళ్లు, భూముల ధరలు అమాంతం పెరిగాయి. ఆ తర్వాత కూడా పెరుగుదల స్థిరంగా కొనసాగింది. ఇంటిపై వ్యయం చేసేటప్పుడు వచ్చే అద్దెలు ఎంత అనేది కూడా చూస్తారు. దీని ఆధారంగానే కొందరు పెట్టుబడి పెడుతుంటారు. ఐటీ వంటి సేవా రంగం ఆధిపత్యం ఉన్న నగరాల్లోని కొన్ని కీలక ప్రాంతాల్లో అద్దెలు 30 శాతానికి మించి పెరిగాయి.ముమ్మందు ఇదే విధంగా రాబోయే రెండు మూడేళ్లలో సిద్ధమైన ఇళ్లు మార్కెట్లోకి ప్రవేశించే అవకాశం ఉన్నప్పటికీ అద్దె డిమాండ్ కొనసాగుతుందని ఈ రంగంలోని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇందులో నిరంతర వృద్ధి కారణంగా దీర్ఘకాలిక పెట్టుబడిదారులు ఆసక్తి కనబరుస్తున్నారని చెబుతున్నారు. ఇంటి అద్దెలు పెరగడానికి ఆర్థిక అంశాలు కూడా మరో కారణం. ఇల్లు కొనాలంటే డౌన్ పేమెంట్, నెలవారీ వాయిదా, నిర్వహణ తదితర ఖర్చులు భరించాల్సి ఉంటుంది. దీంతో చాలామందికి అద్దె ఇళ్లలో ఉండటమే మెరుగైన ఎంపికగా ఉంటుంది. ఆర్థికంగా కాస్త వెసులుబాటు ఉ ండాలనుకునేవారికి, ఇప్పుడిప్పుడే కెరీర్ ప్రారంభిస్తున్నవారికి ఇల్లు కొనడం కంటే అద్దె ఇంట్లో ఉండటమే మంచి ఆప్షన్ గా ఉంటోంది. దీంతో దేశంలో అద్దె ఇళ్లకు డిమాండ్ బాగా పెరిగింది.అద్దె మార్కెట్ పెరగడానికి మిలీనియల్ జనరేషన్ కూడా ఓ కీలక కారణం. మిలీనియల్స్ ఆస్తుల కంటే అనుభవాలకు ప్రాధాన్యత ఇస్తారు. దీంతో ఒక్కరే సొంతింట్లో ఉండటం కంటే స్నేహితులతో కలిసి అద్దె ఇంట్లో ఉండటానికే మొగ్గు చూపిస్తున్నారు. మారుతున్న జీవనశైలి, మిలీనియల్స్ కు పెరిగిన కొనుగోలు శక్తి కూడా దేశంలో అద్దె ఇళ్లకు డిమాండ్ పెరగడానికి కారణాలు. మొత్తానికి చూస్తే.. దేశంలో అద్దె ఇళ్లకు డిమాండ్ పెరగడానికి చాలా కారణాలున్నాయి. వాటిలో సామాజిక, ఆర్థిక అంశాలతోపాటు జీవనశైలి మార్పులు కూడా ఉన్నాయి. పెరుగుతున్న పట్టణీకరణ, మారుతున్న యువతరం ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుంటే అద్దె ఇళ్ల డిమాండ్ భవిష్యత్తులోనూ కొనసాగే అవకాశం ఉంది. దీంతో అద్దె మార్కెట్ లో రియల్ పెట్టుబడిదారులకు మరిన్ని అవకాశాలు పెరుగుతాయి.

# ఓటు హక్కు... వినియోగించుకోవాలి




అహ్మదాబాద్: మూడో విడత సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ప్రధాని నరేంద్ర మోడీ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అహ్మదాబాద్‌లోని నిషాన్ హైస్కూల్‌లో ప్రధాని మోడీ ఓటు వేశారు. మోడీతో పాటు పోలింగ్ కేంద్రం వద్దకు అమిత్ షా వచ్చారు. ఈ సందర్భంగా మోడీ మీడియాతో మాట్లాడారు. ఎండల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని ప్రధాని మోడీ ప్రశంసించారు. ఎన్నికల వేళ ప్రజలు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, వీలైనంత ఎక్కువ నీళ్లు తాగితే ఆరోగ్యం బాగుంటుందని, సమయంతో పోటీపడుతూ మీడియా మిత్రులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో ఓటుకు విశేష ప్రాధాన్యం ఉందని, దేశ ప్రజలు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# ఈ 'ఓట్ల పండుగ' ఓటర్లదేనా?

పద్దెనిమిదవ సార్వత్రక ఎన్నికల మొదటి రెండు విడతల పోలింగ్ ముగిసింది. ఇంకా ఐదు విడతల పోలింగ్ జరగవలసి వున్నది. ఇంతలో, ప్రచండ వేసవి గాడ్పులు, ఎన్నికల ప్రచార వేడి మిళితమై ఒక తీవ్ర ఉక్కపోతతో సతమతమవుతున్న దేశ ప్రజల ముందుకు అనుకోకుండా ఒక పెద్ద ప్రశ్న వచ్చింది: టీవీ స్టూడియోలలోను, విశాల సమాజంలోను రాజకీయ పార్టీల నాయకుల వాద ప్రతివాదాల హోరు ఎడతెగకుండా మిన్నంటుతున్నా కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఈ ప్రజాస్వామిక 'పండుగ'లో పాల్గొంటున్న వారి సంఖ్య అంచనాల కంటే ఎందుకు తక్కువగా ఉన్నది? మండుతున్న ఎండా కాలం, పంట కోతల సమయం, సుదీర్ఘ వారాంతపు సెలవులు అనేవి పోలింగ్ శాతం తక్కువగా ఉ ండడాన్ని పాక్షికంగా మాత్రమే వివరిస్తాయి. నిజమేమిటంటే దేశంలోని వివిధ ప్రాంతాలలో ప్రజాస్వామిక లోటు (ప్రజాస్వామిక సంస్థలు, వ్యవస్థలు తమ కార్యాచరణల్లో ప్రజాస్వామ్య సూత్రాలకు చిత్తశుద్ధితో కట్టుబడి ఉండకపోవడం, పర్యవసానంగా ప్రజాస్వామ్య ప్రక్రియల పట్ల ప్రజల్లో అనాసక్తి, నిర్లిప్తత పెరిగిపోవడం వల్ల నెలకొనే పరిస్థితి) గణనీయంగా ఉన్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే మన ప్రజాస్వామ్యం అసమగ్రంగా ఉన్నది. సామాన్యుల ఆరాటాలను ఆర్తీలు, నేతలు పట్టించుకోవడం లేదు. కనుకనే సగటు ఓటరు తన ప్రతినిధిగా ఏ పార్టీ అభ్యర్థిని ఎన్నుకోవాలనే విషయమై అంతకంతకూ ఉత్సుకతను కోల్పోతున్నాడు. పార్లమెంటు సభ్యుడుగా తన విధ్యుక్త ధర్మాలను చిత్తశుద్ధితో నిర్వర్తించగలడనే భరోసాను వివిధ పార్టీల అభ్యర్థులలో ఏ ఒక్కరూ ఇవ్వలేకపోవడమే అందుకు కారణంగా చెప్పవలసి ఉన్నది. ఎన్నికల ముందు రోజుల్లో విజయోత్సాహంలో ఉన్న భారతీయ జనతా పార్టీ 'అబ్కీ బార్ చార్ సౌ పార్' అనే నినాదాన్ని ఇచ్చింది, 400 సీట్లతో తమ పార్టీ విజయం సాధించగలదని ఆ పార్టీ శ్రేణులు ఆత్మవిశ్వాసంతో చెప్పాయి. లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ విజయం ఇప్పటికే ఖాయమైపోయిందని, అయితే 1984 సార్వత్రక ఎన్నికలలో 414 నియోజకవర్గాలను గెలుచుకున్న రాజీవ్ గాంధీ రికార్డును ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధిగమించగలరా అన్న విషయం మాత్రమే మిగిలివుందని బీజేపీ వర్గాలు అంటున్నాయి. ఎన్నికల ప్రచారం ఊపందుకుని, రెండ విడతల పోలింగ్ సైతం ముగిసిన ప్రస్తుత తరుణంలో అధికార, ప్రతిపక్షాలు రెండింటికీ ఓటర్ల విషయమై ప్రాథమిక వాస్తవాలు తెలిసివచ్చాయి. ఏ రాష్ట్రంలోనూ అటు అధికార పక్షం/ కూటమికి గానీ, ఇటు ప్రతిపక్షం / కూటమికి గానీ అనుకూల పవనాలు వీయడం లేదన్నది స్పష్టంగా కన్పిస్తున్నది. ఓటర్లు ఏ పక్షం వైపు మొగ్గ చూపడం లేదనేది విశదమయింది. (మొదటి విడతలో పోలింగ్ శాతం అంచనాల కంటే 3 శాతం తక్కువగా నమోదయింది). వెన్వెంటనే ప్రధాని మోదీ, ఓటర్లలో మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం ప్రారంభించారు. 2047 సంవత్సరం నాటికి 'వికసిత్ భారత్'ను నిర్మిస్తామన్న హామీతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన బీజేపీ మొదటి దశ ఎన్నికలు ముగియగానే మాట మార్చింది. ఆశాభావ రాజకీయాల నుంచి భయాన్ని సృష్టించే రాజకీయాలకు మారింది. ఆశాభావం, భయం అసాధారణమైన సహచరులు. భయపూరిత రాజకీయాలు హానికరమైనవి, విధ్వంసకరమైనవి కాగా ఆశాభావ రాజకీయాలు సానుకూలమైనవి, నిర్మాణాత్మకమైనవి, సృజనాత్మకమైనవి. 2024 సార్వత్రక ఎన్నికలు ఒక ఆశాభావంతో ప్రారంభమయ్యాయి. అయితే ఈ ఆశాభావం శీఘ్రగతిన అర్ధ సత్యాలు, అబద్ధాలను నిర్భయంగా వ్యాపింపజేసే ఒక భయపూరిత వాతావరణంలోకి జారిపోయింది. రాజస్థాన్‌లో ఒక ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ తన శ్రోతల్లో తీవ్ర సంకుచితత్వ భావాలను రెచ్చ గొట్టేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్ మానిఫెస్టో ముస్లింలీగ్ మానిఫెస్టోలా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ వారు అధికారంలోకి వస్తే మీ ఆస్తులను స్వాధీనం చేసుకుని చొరబాటుదారులకు పునః పంపిణీ చేస్తారని మోదీ హెచ్చరించారు.

అంతే కాకుండా స్త్రీల మెడల్లో ఉన్న మంగళసూత్రాలను సైతం తెంచుకు పోతారని కూడా ఆయన ఆరోపించారు. ఏ రాజకీయ ప్రయోజనాన్ని ఆశించి ప్రధానమంత్రి ఇటువంటి ఆరోపణలు చేశారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పార్టీకి ప్రధాన మద్దతుదారులుగా ఉన్న హిందూత్వవాదులను రెచ్చగొట్టి, సుపరిచిత 'శత్రువు'కు వ్యతిరేక పోరాటంలో వారు పాల్గొనేలా చేయడమే ఆయన లక్ష్యం. ఎన్నికలలో బీజేపీ ఒక విజేతగా నిలవటంలో భారతీయ ముస్లింలు కీలక పాత్ర వహిస్తున్నారు. 1990ల్లో వారిని 'బాబర్‌కి ఔలద్' అని పరిహసించారు. ఇప్పుడు వారిని 'ఘస్ పేటియాన్' (చొరబాటుదారులు) అని నిందిస్తున్నారు. బీజేపీ మళ్లీ మతతత్వ వక్రీకరణలకు పాల్పడుతుండగా, కాంగ్రెస్ సైతం ఊహాత్మక భయాల ఆధారంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచార సభలలో భారత రాజ్యాంగం ప్రతిని ఎత్తిచూపుతూ, బీజేపీ అధికారంలోకి వస్తే దళితులు, ఆదివాసీలు, ఓబీసీలకు రిజర్వేషన్లను శాశ్వతంగా రద్దు చేసేందుకు రాజ్యాంగానికి సవరణలు చేస్తుందని హెచ్చరిస్తున్నారు. విద్వేషపూరిత ప్రసంగాలతో మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తుండగా మండల్ 'సామాజిక న్యాయ'వాదుల మద్దతును కూడగట్టుకునేందుకు కాంగ్రెస్ ఆరాటపడుతోంది.అయితే సగటు ఓటర్లకు బీజేపీ, కాంగ్రెస్ ధోరణులు ఏవీ పట్టడం లేదు. ఆ పార్టీల ప్రచారాలకు వారు స్పందించడంలేదు. జీవనోపాధి సమస్యలతో సతమతమవుతున్న సగటు ఓటర్లు వాటి నుంచి బయటపడేందుకే ప్రాధాన్యమిస్తున్నారు. ఆసేతు హిమాచలం పర్యటించండి%–% నాయకులు, సామాన్య పౌరుల మధ్య సంబంధరాహిత్యం ఎంతగా ఉన్నదో స్పష్టమవుతుంది. గత ఐదేళ్లుగా అసంఖ్యాక భారతీయులు, కోవిడ్ మహమ్మారి, సుదీర్ఘ లాక్‌డౌన్‌లు, ధరల పెరుగుదల, ఉద్యోగాలు కోల్పోవడం, ఆదాయాలు పడిపోవడం మొదలైన సమస్యలతో సతమత మవుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వారిలో సుభిక్ష భావన (ఫీల్‌గుడ్) సృష్టించడం ఎలా సాధ్యమవుతుంది? ఈ కారణంగానే రాజకీయ నాయకుల ప్రసంగాలు, హామీలు వారి నేమాత్రం ఆకట్టుకోలేకపోతున్నాయి. నగరాలలో సాయం సంధ్యల్లో వివిధ సభలు, సమావేశాలలో పాల్గొనే వారికి 'ప్రభవిస్తున్న నవభారతం' అనేది ఒక ఉత్తేజకర చర్చనీయాంశం కావచ్చు గానీ దుర్భర పరిస్థితులు ఉన్న గ్రామీణ భారతంలో వాటర్ ట్యాంకర్ ఎనిమిది రోజులకు ఒకసారి మాత్రమే రావడం అనేది ఒక కఠోర వాస్తవం. మరి 'నవభారత్' గురించిన ఉద్ఘాటనలు సగటు పౌరులను ఎలా ఉత్తేజపరుస్తాయి? రాజకీయ నాయకుల ప్రసంగాలకు, సంఖ్యానేక ప్రజల వాస్తవ జీవన పరిస్థితులకు మధ్య తీవ్ర అంతరం ఉంటోంది. నేతల ఈ నిర్లక్ష్య వైఖరులే అత్యధిక ఓటర్లలో ఎన్నికల ప్రకియ పట్ల ఉదాసీనతను కాకపోయిప్పటికీ ఏ పార్టీ అభ్యర్థికి ఓటువేయాలనే విషయమై ఒక నిశ్చయానికి రాలేని మందకొడితనాన్ని కలిగిస్తున్నాయి. మహారాష్ట్రనే చూడండి. పశ్చిమ భారతంలోని ఈ ప్రధాన రాష్ట్రంలో గత మూడేళ్లలో అనేక రాజకీయ ఉపద్రవాలు సంభవించాయి. ఐదేళ్లలో ముగ్గురు ముఖ్యమంత్రులు మారారు. విధేయతలు మార్చుకోవడం, రహస్య పొత్తులు పెట్టుకోవడం మొదలైన పరిణామాలు రాష్ట్ర పాలనపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ప్రధాన రాజకీయ పార్టీల కార్యకర్తల సైతం ఎన్నికల సంబంధిత వ్యవహారాలలో పాల్గొనేందుకు ఎంత మాత్రం ఆసక్తి చూపడం లేదు. రాజకీయవేత్తలు తమ ఆస్తి పాస్తులను పెంచుకుంటూ పదవులను అధిష్ఠిస్తుండగా సగటు కంటే తక్కువ వర్షపాతంతో వ్యవసాయరంగంలో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ముంబై సంపన్నులు విలాస జీవితాలు గడుపుతుండగా ట్యాంకర్ మాఫియా గ్రామీణ మహారాష్ట్రలో ఒక పెద్ద బకెట్ నీటిని రూ. 200కి విక్రయిస్తోంది! రాజకీయ నాయకులు పెద్ద పెద్ద హామీలు ఇచ్చి వాటిని ఏ మాత్రం నెరవేర్చకపోతుండడంతో వారి పట్ల గ్రామీణ ప్రాంతాల ఓటర్లలో భ్రమలు తొలగిపోయాయి. ఇప్పుడు ఎన్నికల విషయంలో



గ్రామీణ ఓటర్ల ఆలోచనలకు ఈ వాస్తవాలే ఆధారంగా ఉంటున్నాయి అంటే ఎన్నికల పట్ల వారి మనోవైఖరులు ఎలా ఉన్నాయనేది ఎవరికి వారే అర్థం చేసుకోవచ్చు. రాజకీయ నాయకులు, ముఖ్యంగా అధికారంలో ఉన్న వారి పట్ల వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. 'మోదీ గ్యారంటీ'లకు సంబంధించిన పోస్టర్లు పల్లె పల్లెన ప్రతి వీధిలోనూ వెలసినా పాలకుల పట్ల వారి వ్యతిరేకతను తగ్గించలేకపోతున్నాయి. అవును, ప్రజల్లో ప్రబలిన ప్రభుత్వ వ్యతిరేకత కారణంగానే బీజేపీ వంద మందికి పైగా సిట్టింగ్ ఎంపీలను మార్చివేయడం జరిగింది. ఈ వాస్తవాలు మరొక పెద్ద ప్రశ్నను మన ముందుంచుతున్నాయి : జీవన పోరాటంలో అలసిపోయిన ఓటర్ అసంతృప్త మనోవైఖరి నుంచి ఎన్నికలలో లబ్ధిపొందేదెవరు? నష్టపోయేదెవరు? బీజేపీ సహేతుకంగానే తన విజయంపై ఆత్మవిశ్వాసంతో ఉన్నది. పటిష్ఠ ఎన్నికల యంత్రాంగం, అందునా ప్రజల విశ్వాసాన్ని మరెవరికంటే ఎక్కువగా పొందుతున్న ఒక శక్తిమంతమైన నాయకుడి నిర్ణయాలు, నిర్దేశాలకు పని చేస్తుండడంతో తాము వరుసగా మూడోసారి కూడా విజయం సాధించి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ శ్రేణులు పూర్తి నమ్మకంతో ఉన్నాయి. కాంగ్రెస్ కూడా ఒక ఆశాభావంతోనే పోరాడుతున్నది. ఓటర్ల ఉదాసీనత, సరిసమాన స్థాయిలో పోటీ పడుతున్న నియోజకవర్గాలలో ప్రత్యర్థితో గట్టిగా పోరాడే అవకాశాన్ని కల్పిస్తుందనే ఆశ కాంగ్రెస్‌కు నిండుగా ఉన్నది. అయితే భారత ప్రజాస్వామ్య సంక్షోభం బీజేపీ వర్సెస్ ప్రతిపక్షం అనే ద్వంద్వత్వానికి మాత్రమే పరిమితమైనది కాదు. అది చాలా విస్తృతమైనదీ, తీవ్రమైనదని చెప్పి తీరాలి. ఏమైనా ఎన్నికలలో ఏ పార్టీ గెలిచినా ఓటర్లే ఎక్కువగా నష్టపోతున్నారనే భావన ప్రజల్లో బాగా పెరిగిపోతోంది. పార్టీలు, నాయకుల పట్ల ప్రజల ఈ విశ్వాస రాహిత్యమే భారత ప్రజాస్వామ్య సంక్షోభానికి ఒక తిరుగులేని తార్కాణం.

# యువ ఓటర్లే కీలకం!

## చేవెళ్ల లోక్‌సభ స్థానంలో వారిదే నిర్ణయాత్మక పాత్ర





రంగారెడ్డి అర్బన్/వికారాబాద్: చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో విజయావకాశాలను నిర్ణయించే స్థాయిలో యువ ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఈ నియోజకవర్గంలో మొత్తం ఓట్లలో సగానికి పైగా వీరే ఓటుహక్కు కలిగి ఉన్నారు. దీంతో వారిని తమ వైపునకు తిప్పుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ముమ్మర యత్నాలు చేస్తున్నాయి. వారి డిమాండ్లను నెరవేరుస్తామని అభ్యర్థులు, ఆయా పార్టీల నేతలు హామీలు ఇస్తున్నారు. యువతపై ప్రధాన దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. అయితే, ఈ ఎన్నికల్లో యువత ఏ పార్టీ వైపు మొగ్గ చూపుతుందో చూడాలి. ఈ నెల 13వ తేదీన జరగనున్న చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో యువ ఓటర్లే కీలకం కానున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తలరాత రాసేది యువ ఓటర్లే. అభ్యర్థుల గెలుపోటములను యువ ఓటర్లు శాసించనున్నారు. వారు ఎటువైపు మొగ్గ చూపితే ఫలితాలు ఆ వైపు వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందుకే విజయావకాశాల్లో కీలక పాత్ర పోషిస్తున్న యువతను తమవైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. యువ ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు పోటీ పడుతున్నాయి. కాంగ్రెస్ గత ఎన్నికల సమయంలో ప్రకటించిన గ్యారెంటీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తున్నామని, ఎన్నికలు పూర్తి కాగానే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని, రైతు రుణమాఫీ హామీని ఆగస్టు 15వ తేదీలోగా అమలు చేస్తామని, లోక్‌సభ ఎన్నికల్లో తమ అభ్యర్థులనే గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి ఈసారి కూడా మకే మద్దతు పలకాలని బీజేపీ నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిందేమీ లేదని, అయిదు నెలల కిందట రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలతో ఓటర్లను మభ్య పెట్టాలని చూస్తోందని, ప్రజల సంక్షేమం గురించి, రాష్ట్రం అభివృద్ధి గురించి ఆలోచించేది బీఆర్ఎస్ ఒక్కటేనంటూ ఆ పార్టీ నాయకులు ప్రజలకు వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోకి వచ్చే ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 29,38,370 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,504,260 మంది పురుషులు, 1,433,830 మంది మహిలు. అలాగే 280మంది ఇతర ఓటర్లున్నారు. ఈ ఓటర్లలో 18 నుంచి 39 ఏళ్లలోపు యువ ఓటర్లు మొత్తం 15,20,890 మంది ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 39 ఏళ్లలోపు ఓటర్లు జిల్లాలో 52 శాతం ఉన్నారు. ఈ ఎన్నికల్లోనూ యువ ఓటర్లు కీలక భూమిక పోషించనున్నారు. యువ ఓటర్లు తమ కుటుంబ సభ్యులను, ప్రాంత ఓటర్లనూ ప్రభావితం చేసే అవకాశం ఉంది. అందుకే ప్రధాన పార్టీలు యువ ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. ఓటు బ్యాంకుగా ఉండే యువ ఓటర్లను గాలం వేసేందుకు ఆయా పార్టీల నేతలు తెరవెనక ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మధ్య వయస్సు ఉన్న ఓటర్ల సంఖ్య కాస్త తక్కువగా ఉంది. 40–49 ఏళ్ల వయస్సు ఓటర్లు 6,07,268 ఉన్నారు. 50–59 ఏళ్ల వయస్సు ఓటర్లు 3,62,074 ఉన్నారు. 60–69 ఏళ్ల వయస్సు ఓటర్లు 2,13,014 ఉన్నారు.

# కళ్యాణదుర్గంలో హోరా హోరి




**అనంతపురం:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో హోరాహోరీ పోరు నడుస్తోంది. నేతలు డోర్ టు డోర్ క్యాంపెనింగ్ ముగించి రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. కానీ ఆ నియోజకవర్గంలో మాత్రం అభ్యర్థులు మాత్రం ఇంకా స్పీడు తగ్గలేదు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అభ్యర్థులు సుడిగాలి పర్యటన చేస్తున్నారు. అభ్యర్థులే కాదు వారి కుటుంబ సభ్యులు సైతం నిద్రాహారాలు మాని తమ భవిష్యత్తును తేల్చుకునే పనిలో పడ్డారు. అధికార పార్టీ వైఎస్ఆర్సిపి నుంచి అనంతపురం ఎంపీ తలారి రంగయ్య కళ్యాణ్ దుర్గం నియోజకవర్గం అభ్యర్థిగా బరిలో నిలిచారు. కూటమి అభ్యర్థిగా టిడిపి నేత అమిలినేని సురేంద్రబాబు బలిలో దిగనున్నారు. ఇద్దరు నేతల శైలి చాలా భిన్నమైనది. వైసిపి అభ్యర్థి ఎంపీ తలారి రంగయ్య ప్రభుత్వ ఉద్యోగం వదిలిరాజకీయాల్లోకి వచ్చారు. సురేంద్రబాబు క్లాస్ వన్ బిజినెస్ మాన్. ఇప్పటికే తలారి రంగయ్య తన అదృష్టాన్ని 2019లోనే నిరూపించుకున్నాడు. మరోసారి ఎమ్మెల్యేగా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని ఎంచుకున్నాడు. ఆమిలినేని సురేంద్రబాబు తన రాజకీయ ప్రస్థానాన్ని కళ్యాణదుర్గం నుంచి ప్రారంభించారు. ఇరవై ఏళ్ల నుంచి ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రయత్నిస్తున్న అమిలినేని సురేంద్రబాబుకు ఎట్టకేలకు అవకాశం దక్కింది. కళ్యాణదుర్గం నియోజకవర్గం కూటమి అభ్యర్థిగా అధినేత చంద్రబాబు నాయుడు ఆమిలినేని సురేంద్రబాబుకు అవకాశం కల్పించాడు. దీంతో అమిలినేని సురేంద్రబాబు టికెట్ ప్రకటించిన నాటి నుంచి నేటి వరకు నియోజకవర్గంలోని ప్రతి గడపకు వెళ్లి వచ్చారు. నియోజకవర్గంలోని అసమ్మతి నేతలను ఏకం చేసుకుని ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా తన ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. సురేంద్రబాబు తో పాటు ఆయన కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున నియోజకవర్గాలో మండలాల వారీగా తమ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో కళ్యాణదుర్గం నియోజకవర్గవన్ని దోచుకోవడమే పరమావధిగా ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శిస్తూ తమ ప్రచార దూకుడుని పెంచారు. గతంలో ఇక్కడ ఓ మంత్రి ఉండేది ఆమె నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయకుండా కేవలం తన ఖజానాను నింపుకొని ఇక్కడి నుంచి పారిపోయిందని విమర్శిస్తూ వెళ్తున్నారు. ఇక్కడ ఆమె ఎట్టి పరిస్థితులను గెలవదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉషశ్రీ చరణ్ ను వేరే నియోజకవర్గం కు బదిలీ చేసారని బహిరంగ సభలోను ప్రచార సభల్లోను విమర్శిస్తూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. కళ్యాణదుర్గం అంటేనే టిడిపికి బలమైన కేడర్ ఉంది. ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా ఎవరు పోటీ చేసిన కూడా క్యాడర్ మొత్తం వారికి సహకరిస్తూనే ఉంటుంది. గతంలో ఉన్న హనుమంతరావు చౌదరి ఎమ్మెల్యేగా గెలుపొందిగా 2019 ఎన్నికల్లో హనుమంతరావు చౌదరి కాదని మాదినేని ఉమామహేశ్వర నాయుడుకి చంద్రబాబు అవకాశం కల్పించారు. అయితే 2019 ఎన్నికల జగన్ హవాలో మదినేని ఉమా మహేశ్వర్ నాయుడు ఓటమి చవిచూశారు. అక్కడ నుంచి వైసీపీ అభ్యర్థిగా ఉషశ్రీ చరణ్ గెలుపొందారు. ప్రస్తుత సాధారణ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా అమిలినేని సురేంద్రబాబు కళ్యాణ్ దుర్గం నుంచి పోటీ చేస్తున్నారు. సురేంద్రబాబు వ్యవహరిస్తున్న తీరు నియోజకవర్గ ప్రజల దృష్టిని ఆకర్షిస్తుంది. నియోజకవర్గంలో వర్గ విభేదాలతో సతమతం అవుతున్న పార్టీ శ్రేణులకు ఒక్కతాటిపైకి తీసుకువచ్చి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను సైతం ఆకర్షిస్తూ దుర్గం రాజకీయాల్లో కొత్త ఒరవడిని సృష్టించుకుంటూ ముందుకెళు ్తన్నాడు. నియోజకవర్గం అభివృద్ధి ఆకాంక్షించేవారు ఒక వైపు.. పదవి ఆకాంక్షించే వారు మరో వైపు అన్న ధోరణి లో కళ్యాణదుర్గం రాజకీయా ప్రసంగాలతో ముందుకు వెళుతున్నారు. సురేంద్రబాబుకు అంగ బలం అర్థ బలం కలిసి వచ్చే అంశం. మరో వైపు కూటమి మేనిఫెస్టో కూడా పెద్ద ఎత్తున కలిసి రావడంతో గెలుపు అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. 2019 ఎన్నికల్లో అనంతపురం ఎంపీగా గెలిచిన తలారి రంగయ్య ప్రస్తుతం కళ్యాణదుర్గం నియోజకవర్గం వైసీపీ అసెంబ్లీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ మండల స్థాయి నేతలతో కార్యకర్తలతో మమేకమవుతూ తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ నియోజకవర్గంలో గత ఎమ్మెల్యే ఉషశ్రీ చరణ్ చేసిన పనులు వ్యతిరేక విధానాలు రంగయ్య మీద పడుతుండడంతో ఏమి చేయాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో పడ్డారు. నియోజకవర్గంలో అభివృద్ధి అనేది లేకుండా కేవలం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు మాత్రమే నియోజకవర్గ ప్రజలకు అందించారు. గతంలోనూ ఉషశ్రీ చరణ్ కు ఎంపీకు పచ్చగడ్డి వేస్తే బగ్గుమానేలా ఉండేది. నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నంతకాలం ఎంపీ తలారి రంగయ్య నియోజకవర్గం వైపు కన్నెత్తి కూడా చూడని పరిస్థితి. అప్పట్లో ఇద్దరి మధ్య వర్గ విభేదాలతో కళ్యాణ్ దుర్గం నియోజకవర్గంలో వైసీపీ క్యాడర్ రెండు వర్గాలుగా విడిపోయారు. ప్రస్తుతం ఉషశ్రీ చరణ్ వేరే నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నడంతో ఎంపీ తలారి రంగయ్య కళ్యాణదుర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో రంగయ్య వర్గం మాత్రం ప్రస్తుత ఎన్నికలకు సహకరిస్తుండడం ఉషశ్రీ జగన్ వర్గం పైకి సహకరిస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ గ్రౌండ్ లెవెల్ లో అది సాధ్యం కావడం లేదు అనేది బహిరంగ రహస్యం. కేవలం తలారి రంగయ్య బీసీ సామాజిక వర్గం కావడంతో నియోజకవర్గ వ్యాప్తంగా బీసీ ఓటర్లు అధికంగా ఉండడంతో కేవలం ఆ సామాజిక వర్గాన్ని మాత్రమే నమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో కూడా పెద్దగా సహకరించే పరిస్థితి కనిపించడం లేదు. మరోవైపు కుటామి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అంగ బలం ఆర్టిక బలంతో ముందుకు వెళుతుండడంతో తలారి రంగయ్య అంత ఆర్థికంగా వెనుకబడ్డారన్న చర్చ నియోజకవర్గంలో సాగుతోంది.

## ఏడు మండలాలా... ఐదు గ్రామాలా




**ఖమ్మం:** కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోల ఐదు గ్రామాల ప్రస్తావన తీసుకు వచ్చింది. ఏపీలోని ఐదు గ్రామాలను తెలంగాణలో కలుపుతామని ప్రకటించింది. దీంతో కొత్త వివాదం ప్రారంభమయింది. ఇది ఓ రకంగా గట్టు తగాదా లాంటిదే. ఏపీలో ఐదు గ్రామాలు తెలంగాణలో కలుపుకోవాలంటే? ఏపీతో మాట్లాడి.. సామరస్యంగా పరిష్కారం చేసుకోవాలి. మేనిఫెస్టోల్లో పెట్టి రాజకీయం చేస్తే మరింత క్లిష్టం అవుతుంది. పోలవరం ముంపు మండలాలు అయిన ఏడు మండలాల్ని రాష్ట్ర విజజన తర్వాత ఏపీలో కలిపారు. అయితే భద్రాచలం పట్టణాన్ని మాత్రం మినహాయించారు. అదే విషయాన్ని చెప్పి చట్టం చేశారు. భద్రాచలం పట్టణం తప్ప.. మిగిలిన మండలం అంతా ఏపీనే. ఇక్కడే అసలు సమస్య వచ్చింది. భద్రచలానికి అతి సమీపంలో ఉన్న ఐదు గ్రామాలు ఏపీ పరిధిలో కలిసిపోయాయి. కానీ అవి ఏపీకి చాలా దూరంగా ఉన్నాయి. గోదావరి ముంపు రాకుండా కరకట్ట ఆ గ్రామాల్లోనే కట్టాలి. ఇది కట్టడానికి తెలంగాణ సర్కార్ కు అవి ఏపీ గ్రామాలు కావడం సమస్యగా మారింది. అందుకే ఆ గ్రామాలు తమకు ఇవ్వాలని అడుగుతున్నారు. నిజానికి కరకట్ట నిర్మాణమే సమస్య అయితే? తాము కూడా సహకరిస్తామని ఏపీ ప్రభుత్వం ఎప్పుడో చెప్పింది. కానీ వరదలొచ్చే వరకూ నాటి బీఆర్ఎస్ సర్కార్ పట్టించకోలేదు. పైగా ఏడు మండలాలు గుంజుకున్నారంటూ రాజకీయం చేసి సరి పెట్టుకున్నారు. ఇప్పుడు ఏడు మండలాలు కాకుండా ఐదు గ్రామాలతో కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది. ఆ ఐదు గ్రామాల ప్రజల గురించి జగన్ సర్కార్ పట్టించుకోకపోవడంతో అక్కడి ప్రజల్లోనూ తమ గ్రామాలను తెలంగాణలో కలపాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ఈ సమస్యను రాజకీయం చేసుకుని సెంటిమెంట్ పెంచేందుకు కాంగ్రెస్ బయలుదేరింది.

# రేసులోకి వచ్చిన కాంగ్రెస్



**అనంతపురం:** అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం అందర్నీ ఆకర్షిస్తోంది. ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ రేసులో ఉందని చెప్పుకుంటున్న ఒకే ఒక్క నియోజకవర్గం శింగనమల. మాజీ మంత్రి శైలజానాథ్ గతంలో ఇక్కడ్నుంచి రెండు సార్లు గెలిచారు. మారిన పరిస్థితుల్లో మరోసారి తనను ఆదరించాలని ఆయన ప్రజల ముందుకు వెళ్తున్నారు. శింగనమలలో సామాజిక సమీకరణాలు కీలకంగా మారుతున్నాయి. టీడీపీ, వైసీపీ అభ్యర్దులకు ఆ పార్టీల నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు అందటం లేదనే అభిప్రాయం ఉంది. దీన్ని అసరాగా చేసుకుని శైలజానాథ్ గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఏపీలో అన్ని చోట్లా ద్విముఖ పోటీలు జరుగుతున్నాయి. శింగనమలలో త్రిముఖ పోటీ ఉంది. మూడు పార్టీల అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. రెండు వారాల కిందటి వరకూ టీడీపీ, వైసీపీ మధ్యే పోటీ ఉండేది. రెండు సార్లు శాసనసభ్యులుగా గెలిచిన మాజీ మంత్రి శైలజానాథ్ తన హయాంలో సింగనమల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని నియోజకవర్గ ప్రజలకు వివరిస్తూ తనదైన శైలిలో శైలజానాథ్ దూసుకుపోతున్నారు. శైలజానాథ్‌కు ఉన్న పరిచయాలు కేవలం కాంగ్రెస్ పార్టీకే పరిమితం కాదు. ఇతర పార్టీల వారితో కూడా మంచి సత్సంబంధాలు కలిగి ఉన్నారు.ఇప్పుడు ఇదే ఆయనకు ప్లస్ పాయింట్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. శింగనమల రిజర్వుడు నియోజకవర్గం. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేగా జొన్నలగడ్డ పద్మావతి ఉన్నారు. ఆమె గెలిచే చాన్స్ లేకపోవడంతో అభ్యర్థిని మార్చాలనుకున్నారు. అయితే పద్మావతి భర్త సాంబశివారెడ్డి తాము చెప్పిన వారికే సీటివ్వాలని పట్టుబట్టిన తన వద్ద టిప్పర్ డ్రైవర్ గా పని చేస్తున్న వీరాంజనేయులుకు టిక్కెట్ ఇప్పించుకున్నారు. నియోజకవర్గం మొత్తం ఆయన అభ్యర్థి కాదని.. సాంబశివారెడ్డినే అభ్యర్థి అనే క్లారిటీ ఉంది. విరాంజనేయులు గెలిచినా టిప్పర్ డ్రైవర్ గానే ఉంటారు? సాంబశివారెడ్డినే పెత్తనం చేస్తారు. అందుకే వారి పెత్తనంపై వ్యతిరేకతో ఉన్న వారు వైసీపీలో ఉన్నప్పటికీ సపోర్ట్ చేయడం లేదు. టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణికి కూడా సొంతపార్టీలో వ్యతిరేకత ఉంది. ఆమెను మార్చాల్సిందేనని మొదట్లో పట్టుబట్టారు. అయితే చంద్రబాబు సర్ది చెప్పడంతో తర్వాత అందరూ కలసి పని చేస్తున్నారు. శ్రావణి పరిస్థితి అనుకూలంగా ఉందని టీడీపీ గట్టి నమ్మకంతో ఉంది. యువ నేత కావడంతో .. గ్రామాల్లో యువతను ఆకర్షిస్తున్నారు. త్రిముఖ పోటీలో ఏదైనా జరగొచ్చన్న అభిప్రాయం ఉంది. కాంగ్రెస్ గెలిస్తే మాత్రం అదో సంచలనం అవుతుంది.

## నదిచాగి లో రామన్నాగౌడ ఆధ్వర్యంలో ఇంటింట ఎన్నికల ప్రచారం



**కౌతాళం:** మంత్రాలయం నియోజకవర్గం నదిచాగి గ్రామంలో వైఎస్ఆర్సీపీ మండల నాయకులు రామన గౌడ ఆధ్వర్యంలో 2024 సార్వత్రిక ఎన్నికల ఎంపీ అభ్యర్థి బివై రామయ్య మరియు ఎమ్మెల్యే అభ్యర్థి బాలనాగిరెడ్డి తరపున ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది, రామన్నగౌడ మరియు వైఎస్ఆర్సీపీ కార్యకర్తలు నదిచాగి గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ జగన్ ప్రభుత్వంలో మన గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను గుర్తుచేసుకుని అలాగే పార్టీలకు అతీతంగా,అన్ని వర్గాలకు అందించిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ, సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మే 13 న మరొక్కసారి వైఎస్ఆర్సీపీ పార్టీ ఫ్యాన్ గుర్తు పై ఒకటి ఎమ్మెల్యే,ఇంకొకటి ఎంపీ అభ్యర్థులకు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు,వృద్దులు ఎంపిటీసీ లింగన్నగౌడ తో మాకు సచివాలయం, బ్యాంకులద్వార ఇస్తున్న పెన్షన్ మా చేతికి అందకుండా అకౌంట్ లో మినిమం బ్యాలెన్స్ ఉండాలని అలాగే కొందరికి రుణాలు ఉన్నవారికి నగదు ఇవ్వడంలేదని,మరికొందరి సహకార బ్యాంకులకు జమ కావడంతో ఎంతో ఇబ్బంది పడుతున్నామని ఎంపిటీసీ లింగన్నగౌడ దృష్టికి తీసుకురాగా చంద్రబాబు వలంటర్లను అడ్డుకోవడం ద్వారా ఈ దుస్థితి ఏర్పడిందని,జూన్ 4 వతేది నతరం జగన్ ప్రభుత్వం రాగానే మళ్లీ వలంటీర్ల వ్యవస్త కొనసాగిస్తూ వృద్దులకు ఇంటింటికీ పెన్షన్లు అందిస్తామని వృద్దులకు చెప్పుకొచ్చారు, ఎన్నికల ప్రచారంలో పెద్దఎత్తున వైఎస్ఆర్సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపెట్టి గెలిచింది



**రాజన్న సిరిసిల్ల:** సోమవారం ఉదయం దయం సిరిసిల్ల పట్టణం శాంతి నగర్ లోనీ కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా అభ్యర్థి బోయిన్పల్లి వినోద్ కుమార్ గెలుపుకోసం పలు వార్డులలో మాజీ మంత్రి కేటీఆర్ ప్రచారం నిర్వహించారు. కార్నర్ మీటింగ్ పాల్గొన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ నేత కార్మికుల కోసం 3 వేల కోట్ల రూపాయల ఖర్చు చేసుకొని కార్మికులను కాపాడుకున్నం. 5 ఏళ్లలో ఒక్క రూపాయి మందు పంచలేదు. మీరు నాకు ఇచ్చిన దయ. రాజకీయంగా జన్మనిచ్చింది సిరిసిల్ల నే. సిరిసిల్ల పట్టణం అతి సుందరంగా తీర్చి దిద్దుకున్నం. మీరు నన్ను ఇక్కడా గెలిపించిన కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపెట్టి గెలిచింది. మోచేతికి బెల్లం పెట్టీ మోసపూరిత హామీలతో గెలిచింది. ఆరు గ్యారంటీ లో ఒక్కటి అమలు చేసి మోగొల్లకు మహిళకు తకులాట పెట్టిండు. ఆరు గ్యారంటీలు అమలు అయ్యాయా చెప్పండి.అబద్ధాలు చెపితే డిజిటల్ ప్రపంచలో ఒక్క నిమిషాల్లో దొరికిపోయారని అన్నారు. అన్నమో రామచంద్ర అనే పరిస్థితి వచ్చింది కెసిఆర్ ప్రభుత్వం పోయాకా. తెలంగాణ తెచ్చిన కెసిఆర్ ను పట్టుకొని కాంగ్రెస్ పార్టీ అనేక మాటలు, భుతులు మాట్లాడుతున్నారు. 100 రోజుల్లో రైతు రుణమాఫీ, ఫించన్లు వచ్చాయా.ఓట్లు చేసుకునేటప్పుడు ఒక లెక్క ఓట్లు వేయించుకున్నాకా ఒక లెక్క ఉంది కాంగ్రెస్ పార్టీ తీరు. కెసిఆర్ మల్ల కావాలంటే 13 తేదీన కారు గుర్తుకు వేసి గెలిపించండి. తెలంగాణలో శాసించే అధికారం వస్తుంది. రాముడు అందరి వాడు. మతం పేరుతో ఓట్ల రాజకీయం చేస్తున్నారు. వేములవాడ రాజన్న, కొండగట్టు దేవాలయాలు బిజెపి పుట్టక ముందు నుండే ఉండేవి. సిరిసిల్లలో అనేక అభివృద్ధి పనులు చేసినా, బీజేపీ ఒక్క పని చేసిండా శిలాఫలకం అన్న వేసిండా వారికి ఎందుకు ఓటు వేయాలి. మోడీ ముడి చమురు ధరలు తగ్గినా పెట్రోలు, డీజిల్ రెట్లపై పన్నులు వేసి వసూలు చేసారు.మనకు ప్రధాన మంత్రి కాదు ఫైరమైన ప్రధాన మంత్రి. ఆప్ కీ బార్ 420 అంటున్నారు. అక్కరికి రానీ సుట్టాలకు ఎందుకు ఓటు వేయాలి. నాకు జోడి దారు దొరికితే రాష్ట్రం, కేంద్రం పై పోరాడే శక్తి వస్తుందని అన్నారు.

# గులాబీ బాటలో కాంగ్రెస




**హైదరాబాద్:** ఉప ఎన్నికలు వచ్చినచోట వరాలు ప్రకటించడం.. ప్రభుత్వ పథకాలు ప్రారంభించడం.. మిగతా నియోజకవర్గాలకు కత్తెర వేసి నిధులు మళ్లించడం.. పదేళ్ల పరిపాలన కాలంలో భారత రాష్ట్ర సమితి ఇటువంటి వ్యవహారాలను దర్జాగా కొనసాగించింది. ప్రతిపక్షాలు విమర్శించినప్పటికీ లెక్క చేయలేదు. పైగా ప్రతిపక్షంలో బలంగా ఉన్న నాయకులను కొనేసింది. వారికి ఏదో ఒక పదవిని పడేసింది. ఇలాంటి వ్యవహార శైలి నచ్చక గత అసెంబ్లీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితిని ప్రజలు ఓడించారు. మూడోసారి అధికారాన్ని దక్కించుకుంటామని భావించిన కేసీఆర్ ను ప్రతిపక్షానికి పరిమితం చేశారు. అప్పట్లో భారత రాష్ట్ర సమితి కొనసాగించిన ఈ ధోరణి ని కాంగ్రెస్ విమర్శించింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్.. గత భారత రాష్ట్ర సమితి చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సింది పోయి.. అదే విధమైన రాజకీయాలను అవలంబిస్తున్నది. లాస్య నందిత కన్నుమూయడంతో కంటోన్మెంట్ స్థానానికి ఉప ఎన్నిక వచ్చింది. ఉప ఎన్నికల్లో దివంగత మాజీ ఎమ్మెల్యే సాయన్న పెద్ద కుమార్తె భారత రాష్ట్ర సమితి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తోంది. ఈ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ కూడా అభ్యర్థిని పోటీలో నిలిపింది.. ఈ క్రమంలో ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని భావిస్తోంది. కంటోన్మెంట్ నియోజకవర్గంపై వరాల జల్లు కురిపిస్తోంది. ఈ నియోజకవర్గ ప్రజలకు 6000 ఇందిరమ్మ ఇళ్ళను తొలి విడతలో మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇలాంటి వరాల జల్లు పై సొంత పార్టీ నాయకులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ పథకంలో భాగంగా అన్ని నియోజకవర్గాలకు 3,500 ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ, కంటోన్మెంట్ కు 2,500 ఇళ్లు అదనంగా ఇస్తామని ప్రకటించింది. దీనిపై భారత రాష్ట్ర సమితి నాయకులు, భారతీయ జనతా పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. గతంలో ఉప ఎన్నికలు జరిగినప్పుడు కాంగ్రెస్ మాట్లాడిన మాటలకు.. ఇప్పుడు చేస్తున్న చేతలకు పొంతనలేదని అంటున్నారు. ప్రజలకు వరాల ఆశ చూపించి, తమకు ఓటు వేసేలా పన్నాగాలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ భారత రాష్ట్ర సమితి పై నిప్పులు చెరిగింది. ఉప ఎన్నికలు జరిగే నియోజకవర్గాలపై వరాల జల్లు కురిపించడాన్ని తప్పు పట్టింది. ఇతర నియోజకవర్గాలకు కేటాయించే నిధుల్లో కోత విధిస్తూ.. ఉప ఎన్నికలు జరిగే సెగ్మెంట్లకు నిధుల వరద పారించడాన్ని విమర్శించింది.. కొత్త పథకాలకు రూపకల్పన చేయడాన్ని ఆరోపించింది..కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాష్ట్ర సమితి చేసిన తప్పునే, కాంగ్రెస్ పార్టీ చేస్తోంది.. ఇతర నియోజకవర్గాలకు తగ్గించి, కంటోన్మెంట్ కు అదనంగా 2,500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయించి, తన ఓటు బ్యాంకు రాజకీయాన్ని ప్రదర్శిస్తోంది. మరి ఇలాంటి రాజకీయాలను రేవంత్ రెడ్డి ఎలా సమర్థిస్తారో చూడాల్సి ఉంది.

## ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం

### - ముగ్గురు అధికారులకు షోకాజ్



**శ్రీకాకుళం:** ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన కారణంగా ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలకు ఉపక్రమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మనజీర్ జిలాని సమూన్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నరసన్నపేటలో శనివారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల ప్రక్రియలో గందరగోళ పరిస్థితులకు తావిచ్చిన కారణంగా వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు, 24 గంటల్లో నోటీసులపై స్పందించి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. నరసన్నపేట రిటర్నింగ్ అధికారి రామ్మోహన్ రావు, మెప్మా పీడీ, పోస్టల్ బ్యాలెట్ ఫెసిలియేషన్ సెంటర్ ప్రత్యేక అధికారి కిరణ్ కుమార్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, సారవకోట తహసిల్దార్ భాగ్యలక్ష్మిలు షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు.

# పెద్దపల్లిలో పాగా వేసేది ఎవరు

**కరీంనగర్:** పెద్దపల్లిలో రాజకీయంగా అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ కంచుకోటలో పాగా వేసేందుకు బిఆర్ఎస్, బీజేపి ప్రయత్నిస్తున్నాయి. సిట్టింగ్ ఎంపీకి చెక్ పెట్టి కొత్త అభ్యర్థిని గులాబీ దళపతి కేసీఆర్ బరిలోకి దింపగా, కాంగ్రెస్ ఆర్థికంగా బలమైన వ్యక్తిని, బిజేపి సామాజికంగా అంశాన్ని పరిగణలోకి తీసుకుని సరికొత్త అభ్యర్థిని పోటీలో పెట్టింది. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలతో పాటు 42 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. కాంగ్రెస్ నుంచి గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బిజేపీ నుంచి గోమాస శ్రీనివాస్ పోటీలో ఉన్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ కు కంచుకోటగా ఉన్న పెద్దపల్లి... తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక టిఆర్ఎస్ కు అడ్డగా మారింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కేంద్రంలో బిజేపి, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా సిట్టింగ్ స్థానం బిఆర్ఎస్ ది కావడం.. ఈసారి ఎక్కువ మంది పోటీ చేస్తుండడంతో ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే చర్చ సాగుతుంది. ఎత్తుకు పైఎత్తులతో దూకుడు పెంచిన మూడు ప్రధాన పార్టీలు గెలుపే లక్ష్యంగా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. వెలుగులు విరజిమ్మే ఎన్టీపీసీ, సిరుల మాగాణి సింగరేణి తో మూడిపడి ఉన్న పెద్దపల్లి పార్లమెంట్ పాలిటిక్స్ హాట్ టాపిక్ గా మారాయి. ఎస్సీ రిజర్వుడు స్థానమైన పెద్దపల్లిలో పార్లమెంట్ ఎన్నికల రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. నాలుగు జిల్లాల్లో విస్తరించిన పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం సెంటర్ అట్రాక్షన్ గా నిలుస్తుంది. పెద్దపల్లి, జగిత్యాల, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో ఏర్పడిన ఈ పార్లమెంట్ నియోజకవర్గం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరుగగా 9 సార్లు కాంగ్రెస్, మూడుసార్లు టిడిపి, రెండు సార్లు టిఆర్ఎస్ ఒకసారి తెలంగాణ ప్రజాసమితి గెలిచాయి. కానీ బిజేపి మాత్రం ఒక్కసారి కూడా గెలువలేదు. కనీసం రెండో స్థానానికి సైతం రాలేదు. బీజేపీకి ప్రాతినిధ్యం లేని నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈసారి ట్రైయాంగిల్ ఫైట్ జరుగుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బిఆర్ఎస్ మూడు పార్టీలు ఎవరికి వారే గెలుపు ధీమా వ్యక్తం చేస్తూ కధన రంగంలోకి దుకారు. గెలుపే లక్ష్యంగా అధికార, విపక్ష పార్టీలు పావులు కదుపుతున్నాయి. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు బిఆర్ఎస్ కసరత్తు చేస్తుండగా, అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్ ఎంపీ స్థానాన్ని చేజిక్కించుకునేలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుంది. ఇక బిజెపి? మోడీ నామా జపంతో సత్తా చాటుకునేందుకు యత్నిస్తుంది. మూడు ప్రధాన పార్టీలు ఎత్తుకు పైఎత్తులతో కొత్త ముఖాలను, సరికొత్త అభ్యర్థులను తెరపైకి తెచ్చి సత్తా చాటే పనిలో నిమగ్నమయ్యాయి. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బిజెపి(ఃఏఖ), బిఆర్ఎస్ శక్తియుక్తులను ప్రదర్శిస్తున్నాయి. పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 15 లక్షల 92 వేల 996 మంది ఓటర్లు ఉన్నారు. అందులో మహిళలు 805755 మంది కాగా పురుష ఓటర్లు 787140 మంది, ట్రాన్స్ జెండర్స్ 101 మంది ఓటర్లు ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ ఏడింటిని కైవసం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 12 లక్షల 25 వేల 768 ఓట్లు పోల్ కాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కు 6 లక్షల 82 వేల ఓట్లు రాగా బిఆర్ఎస్ కు 3 లక్షల 74 ఓట్లు లభించాయి. బిజేపికి కేవలం 79 వేల ఓట్లు మాత్రమే లభించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్లు చూస్తే బిఆర్ఎస్ కంటే కాంగ్రెస్ కు మూడు లక్షల ఏడు వేల 670 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. సిట్టింగ్ ఎంపీగా ఉన్న బిఆర్ఎస్ నేత వెంకటేష్ కు 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 4 లక్షల 41 వేల 321 ఓట్లు దక్కాయి. నాలుగున్నరేళ్ల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ కంటే కాంగ్రెస్ కు 3 లక్షల ఏడు వేల ఓట్లు ఎక్కువ వచ్చాయి. ఓట్ల శాతాన్ని చూసి ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కే అనుకూల ఫలితం వస్తుందని భావిస్తున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 1989, 1991, 1996 లో వరసగా మూడుసార్లు కాంగ్రెస్ నుంచి జి వెంకటస్వామి ఎంపీగా గెలుపొందారు. 1998, 1999 లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన సుగుణకుమారి చేతిలో వెంకటస్వామి ఓటమిపాలయ్యారు. తిరిగి వెంకటస్వామి 2004లో కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. 2009 వెంకటస్వామి రాజకీయ రిటైర్మెంట్ తీసుకొని కుమారుడు వివేక్ వెంకటస్వామి బరిలోకి దింపగా 2009లో వివేక్ కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచి పార్లమెంటులో తొలిసారి అడుగు పెట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో వివేక్, టిఆర్ఎస్ నుంచి పోటీ చేసిన బాల్క సుమన్ చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత రాజకీయ పరిణామాల నేపథ్యంలో 2019లో వివేక్ పోటీ చేయలేకపోయారు. ఆ సమయంలో టిఆర్ఎస్ నుంచి వెంకటేష్ నేత, కాంగ్రెస్ నుంచి ఆగం చంద్రశేఖర్, బిజెపి నుంచి ఎస్.కుమార్ పోటీ చేయగా 95 వేల ఓట్ల మెజార్టీతో వెంకటేష్ నేత గెలుపొందారుప్రస్తుతం మూడు ప్రధాన పార్టీలు తక్కువే కాదన్నట్లు వ్యవహరించడంతో తాజా రాజకీయాలు రక్తికట్టిస్తున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం సాగుతుంది. విమర్శలు.. ఆరోపణలు.. సవాళ్ళు ప్రతిసవాళ్ళతో ప్రజల్ని ఆకర్షించేందుకు కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ పోటీ పడుతున్నాయి. పోటీలో 42 మంది అభ్యర్థులు ఉన్నప్పటికి ప్రధానంగా పోటీ మాత్రం కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్యనే కొనసాగుతుంది పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి ప్రస్తుతం ఎంపీ గా వెంకటేష్ నేత కొనసాగుతున్నారు. గత 2019 ఎన్నికల్లో బిఆర్ఎస్ నుంచి గెలిచిన వెంకటేష్ నేత గత రెండు మాసాల క్రితం బిఆర్ఎస్ టిక్కెట్ లభించదని భావించి కారు దిగి కాంగ్రెస్ లో చేరారు. కానీ చివరకు టిక్కెట్ లభించకపోవడంతో నామినేషన్ ల చివరి రోజు కాంగ్రెస్ కు సైతం గుడ్ బై చెప్పి బిజేపిలో చేరాడు. అయన కథ అక్కడితో ముసిగిపోగా అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఒక్కటి కూడా గెలుచుకోలేక పోయినా సిట్టింగ్ ఎంపీ స్థానాన్ని కాపాడుకునేందుకు బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపీ కి చెక్ పెట్టి మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ను బరిలోకి దింపారు. ఇక కాంగ్రెస్ కు కంచుకోటైన పెద్దపల్లి లో పూర్వవైభవాన్ని చాటుకునేందుకు ఆ పార్టీ యత్నిస్తుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి, మంథని, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి ఏడు అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసిన కాంగ్రెస్? పార్లమెంట్ స్థానాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఆర్థికంగా సామాజికంగా బలమైన అభ్యర్థి కోసం అన్వేషించి మాజీఎంపీ స్వర్గీయ వెంకటస్వామి తనయుడు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కుమారుడు గడ్డం వంశీకృష్ణను బరిలోకి దింపింది. ఇప్పటికి వరకు 15 సార్లు ఎన్నికలు జరుగగా అందులో 9 సార్లు కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. అందులో వెంకటస్వామి నాలుగు సార్లు, ఆయన కుమారుడు వివేక్ ఒకసారి ఎన్నికయ్యారు. వంశీ తండ్రీ వివేక్ చెన్నూరు నుంచి, పెద్దనాన్న వినోద్ బెల్లంపల్లి నుంచి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. మంథని నుంచి మంత్రి శ్రీధర్ బాబు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్ చార్జీగా వ్యవహరిస్తున్నారు. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి సైతం ఈసారి పార్లమెంటు ఎన్నికల్లో తమ సత్తాను చాటుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తుంది. ఆ పార్టీ నుంచి నేతకాని సామాజిక వర్గానికి చెందిన గోమాస శ్రీనివాస్ ను పోటీలో నిలిపింది. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సామాజిక పరంగా నేతకాని ఓట్లు ఎక్కువగా ఉండడంతో వ్యూహాత్మకంగా బిజెపి ఎన్నికల ముందు శ్రీనివాస్ ను కాంగ్రెస్ నుంచి బిజెపిలో చేర్చుకుని టిక్కెట్ ఇచ్చింది. టిక్కెట్ ఇచ్చిన తర్వాత శ్రీనివాస్ ప్రచారం చేయకపోవడంతో అభ్యర్థిని మార్చుతారనే ప్రచారం జరగడంతో కాంగ్రెస్ నుంచి టిక్కెట్ అశించి భంగపడ్డ సిట్టింగ్ ఎంపి వెంకటేష్ నేత బిజెపిలో చేరేందుకు యత్నించారు. అప్రమత్తమైన శ్రీనివాస్ ప్రచారం చేపట్టడం.. వెంకటేష్ నేత చేరిక ఆలస్యం కావడంతో చివరకు బిజెపి శ్రీనివాస్ నే కొనసాగించింది. కేవలం నరేంద్ర మోడీ చరిష్మాతో ఎన్నికల బరి లోకి దిగి సత్తా చాటాలనే లక్ష్యంతోనే బిజెపి పోటీ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఆ పార్టీ నాయకుల వ్యూహం ఎలా ఉన్నా పెద్దపల్లిలో బిజెపి పోటీ ఆసక్తికరంగా మారింది.

# కమ్యూనిస్టుల ఉనికి పోరాటం

**న్యూఢిల్లీ:** సుత్తి, కొడవలి గుర్తుతో ఎన్నో పోరాటాలు చేసిన కమ్యూనిస్టు పార్టీ.. ఇప్పుడు సుత్తి, కొడవలి గుర్తు కోసమే పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్ట్ ఉద్యమాలన్నీ 'ఎరుపు రంగు, సుత్తి, కొడవలి, నక్షత్రం' గుర్తుతోనే జరిగాయి. రష్యన్ విప్లవం తరువాత, సోవియట్ యూనియన్‌కు చెందిన ఈ చిహ్నం.. ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన అనేక కమ్యూనిస్ట్ పార్టీల గుర్తుగానూ మారిపోయింది. భారత్‌లోని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) గుర్తు కూడా అదే సోవియట్ చిహ్నం నుండి తీసుకున్నారు. సీపీఎం గుర్తులో ఉండే కొడవలి రైతులను సూచిస్తే, సుత్తి కార్మికులను, నక్షత్రం విప్లవం, కమ్యూనిస్ట్ భావజాలాన్ని సూచిస్తుంది. అయితే, ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఈ గుర్తు సీపీఎంకు దక్కకుండా పోయే పరిస్థితులు నెలకొన్నాయి. సీపీఐ ఇటీవలే జాతీయ పార్టీ హోదాను కోల్పోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 'సీపీఎం'కు సైతం ఇదే గండం వెంటాడుతోంది. భారత్‌లో ఒకప్పుడు బలంగా ఉన్న కమ్యూనిస్ట్ పార్టీలు ఇప్పుడు క్రమంగా మరుగున పడుతున్నాయి. 2004లో వామపక్షాలకు లోక్‌సభలో 59మంది ఎంపీలు ఉండగా, ఇప్పుడు ఐదుగురు మాత్రమే ఉండటం గమనార్హం. పశ్చిమ బెంగాల్, త్రిపురలోనూ తమ పట్టును కోల్పోయాయి. వామపక్షాల నేతృత్వంలోని ప్రభుత్వం ఇప్పుడు కేరళలో మాత్రమే ఉంది. కమ్యూనిస్ట్ పార్టీ మొదటి ఎన్నికల నుండి భారతదేశంలోని ప్రధాన పార్టీలలో ఒకటిగా ఉండేది. ఏ రాష్ట్రంలోనైనా కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మొదటి పార్టీగా కూడా నిలిచింది. కమ్యూనిస్టు పార్టీ చీలిక తర్వాత 1964లో సీపీఎం ఏర్పడింది. ఇది క్రమంగా లెఫ్ట్ బ్లాక్‌లో అతిపెద్దదిగా మారింది. 2004వరకు ఎన్నికల్లో ప్రభావం చూపించిన సీపీఎం.. 2009 నుంచి 2019 మధ్య పశ్చిమ బెంగాల్, త్రిపురలో క్రమంగా పట్టు కోల్పోయింది. 2009 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం పశ్చిమ బెంగాల్‌లో 26, కేరళలో 12, తమిళనాడు, త్రిపురలో రెండేసి, ఆంధ్రప్రదేశ్‌లో ఒకటి సహా 43 స్థానాలను గెలుచుకుంది. ఆ ఎన్నికల్లో పార్టీ దేశవ్యాప్తంగా 5.66శాతం ఓట్లను సాధించింది. 2009 నాటికి సీపీఎం లోక్‌సభ స్థానాలు 16కు తగ్గాయి. బెంగాల్‌లో తొమ్మిది, కేరళలో నాలుగు, త్రిపురలో రెండు, తమిళనాడులో ఒక సీటు గెలుచుకుంది. కానీ, ఓట్ల శాతంలో (5.33%) మాత్రం అంతగా తగ్గుదల కనిపించలేదు. ఇక, 2014 లోక్‌సభ ఎన్నికల్లో, సీపీఎం కేవలం తొమ్మిది స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. కేరళలో ఐదు, బెంగాల్, త్రిపురలలో రెండు సీట్లు. అయితే, ఈసారి ఆ పార్టీ ఓట్ల శాతం 3.6శాతానికి పడిపోయింది. ఇక, 2019 ఎన్నికల్లో సీపీఎంకు కోలుకోలేని దెబ్బపడింది. లోక్‌సభకు కేవలం ముగ్గురు ఎంపీలను మాత్రమే పంపగలిగింది. తమిళనాడు నుండి ఇద్దరు అభ్యర్థులు, అధికారంలో ఉన్న కేరళ నుండి ఒకరు మాత్రమే. బెంగాల్, త్రిపురలలో లోక్‌సభలో సీపీఎం ఎంపీల సంఖ్య జీరోగా మారింది. 2004లో 5.66% ఉన్న ఓట్ల శాతం 2019 నాటికి 1.75%కి పడిపోయింది. 2024లోక్‌సభ ఎన్నికలు సీపీఎంకు మనుగడ కోసం పోరాటంలా మారాయి. జాతీయ పార్టీ హోదా పోకూడదంటే, సీపీఐ పరిస్థితి రాకూడదంటే సీపీఎం మరిన్ని సీట్లు సాధించి, ఓట్ల శాతాన్ని పెంచుకోవాల్సి ఉంది. లేదంటే, తమ పార్టీ గుర్తు కోల్పోయే ప్రమాదం ఉంది. జాతీయ పార్టీ హోదా కోల్పోకుండా ఉండాలంటే (లేదా పొందాలంటే) కనీసం నాలుగు రాష్ట్రాల్లో ఆ పార్టీకి రాష్ట్ర పార్టీగా గుర్తింపు ఉండాలి. లేదా దేశంలోని కనీసం మూడు రాష్ట్రాల్లో ఆ పార్టీ 2శాతం చొప్పున ఓట్లు పొందాలి. లేదా సార్వత్రిక ఎన్నికల్లో(అసెంబ్లీ లేదా లోక్‌సభ) నాలుగు అంతకంటే ఎక్కువ రాష్ట్రాల్లో 6శాతం ఓట్లు.. వేర్వేరు రాష్ట్రాల నుంచి కనీసం 4 ఎంపీ సీట్లు సాధించాలి. ఇతర ప్రమాణాలు ఎలా ఉన్నా.. సీపీఎంకి లోక్‌సభలో నాలుగు ఎంపీ సీట్లు మాత్రం లేవు. ప్రస్తుతం ముగ్గురు సభ్యులు మాత్రమే ఉన్నారు. తమిళనాడు నుంచి ఇద్దరు, కేరళ నుంచి ఒకరు ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోలైన ఓట్లలో ఆ పార్టీకి 1.77శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. 25.97శాతం ఓట్లు రాగా, తమిళనాడులో 2.38శాతం ఓట్లు వచ్చాయి. సీపీఎంకు జాతీయ పార్టీ హోదా ప్రమాదంలో పడిన నేపథ్యంలో ఆ పార్టీ నేతలు అప్రమత్తమయ్యారు. ఈ ఎన్నికల్లో ఆ ప్రమాదం నుంచి గట్టెక్కాలనే పట్టుదలతో ఉన్నారు. "ఈ ఎన్నికల్లో వామపక్షాలకు అధికారిక గుర్తు(కొడవలి, సుత్తి, నక్షత్రం) ఉంది. దాన్ని కాపాడుకోవాలంటే పార్టీకి నిర్దిష్ట ఓట్ల శాతం లేదా ఎంపీలు ఉండాలి. లేని పక్షంలో ఎన్నికల సంఘం ఇచ్చే గుర్తులపైనే పోటీ చేయాల్సి ఉంటుంది" అని సీనియర్ నాయకుడు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఏకే బాలన్ ఇటీవలే వెల్లడించారు. కాగా, సీపీఎంకు ఎదురైన ఈ అస్తిత్వపు ముప్పు పార్టీ చరిత్రలోనే ఇదే తొలిసారి. ఈ ప్రమాదం నుంచి బయటపడేందుకు తమ ఏకైక కంచుకోట అయిన కేరళలో ఓటు షేరింగ్‌ను పెంచుకోవడంపై దృష్టి సారించింది. పరిమిత ప్రభావం ఉన్న ప్రాంతాల్లో వామపక్ష స్వతంత్రులను రంగంలోకి దింపడం వంటి మునుపటి వ్యూహాల మాదిరిగా కాకుండా, సీపీఎం ఇప్పుడు కేరళలోని 20 లోక్‌సభ స్థానాలకుగానూ 15స్థానాల్లో తమ అధికారిక గుర్తుతో పోటీ చేసింది. ఇది తమ స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి తోడ్పడుతుందని సీపీఎం భావిస్తోంది. రెండో దశ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా గత నెల 26న కేరళలోని మొత్తం 20 స్థానాలకూ పోలింగ్ జరిగింది. వీటి ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

## చంపేస్తున్న ఎండలు



**హైదరాబాద్, మే 6:** తెలంగాణలో ఎండల తీవ్రత అధికంగా ఉంది. ఉష్ణోగ్రతలు గరిష్టస్థాయికి నమోదవుతున్నాయి. వడదెబ్బతో శనివారం 19 మంది మరణించినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. భానుడు నిప్పుల వర్షాన్ని కురిపిస్తున్నాడు. ఎండల తీవ్రతతో పాటు వేడి గాలుల ఉధృతి తీవ్రంగా ఉంది. దీంతో ప్రజలు అల్లాడి పోతున్నారు. బయటకు వచ్చేందుకే భయపడిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. గాలిలో తేమశాతం కూడా దారుణంగా పడిపోయింది. హైదరాబాద్ నగరంలో గతంలో ఏ సీజన్ లో వీయనంతగా వేడిగాలులు వీస్తుండటంతో వాతావరణ శాఖ కూడా ప్రజలను అప్రమత్తం చేసింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దంటూ హెచ్చరికలు జారీ చేసింది. ఒకవేళ వచ్చినా తగిన జాగ్రత్తలు తీసుకుని రావాల్సిందేనని చెబుతుంది. ఇప్పటికే వడదెబ్బతో ఆసుపత్రి పాలయిన వారి సంఖ్య అధికంగా ఉండటంతో ఆసుపత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. అత్యధికంగా కరీంనగర్, జగిత్యాల, నల్లగొండ, మంచిర్యాల, నారాయణపేట్, నిజామాబాద్ జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇక్కడ 46 డిగ్రీలకుపైగానే ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఆందోళన వ్యక్తమవుతుంది. మే నెల మొదటి వారంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక రానున్న కాలంలో ఎండల తీవ్రత ఎలా ఉంటుందన్న భయం మరింత ఆందోళనకు గురి చేస్తుంది. యాభై డిగ్రీలకు దాటినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని అంటున్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిపట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ ఔదార్యం



**హుజురాబాద్:** హుజురాబాద్ నుండి ఎన్నికల ప్రచారాన్ని పూర్తి చేసుకొని కరీంనగర్ వెళ్తున్న మార్గమధ్యంలో మాన కొండూర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఔదార్యాన్ని ప్రదర్శించారు.. వెంటనే తన కాన్వాయ్ ను ఆపి గాయపడ్డ వ్యక్తి పరిస్థితి సిబ్బంది తో కలిసి పరిశీలించారు.. అంబులెన్స్ కి వచ్చేలోపు తన వాహనంలో గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు.. అనంతరం గాయపడ్డ వ్యక్తి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.. గాయపడ్డ వ్యక్తి నీ ఆసుపత్రికి తరలించిన తరువాత మంచి వైద్యం అందించాలని డాక్టర్లతో సైతం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు

## మెదక్ జిల్లాలో చిరుత సంచారం



**మెదక్, మే 6:** మెదక్ జిల్లా చేగుంట మండలంలోని ఇబ్రహీంపూర్ అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు గుర్తించామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నాగరాణి తెలిపారు. ఇబ్రహీంపూర్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్స్ లో గురువారం రాత్రి ఫారెస్ట్ నర్సరీలో చిరుత పులి సంచరిస్తున్నట్లు రికార్డు అయ్యిందని ప్రకటించారు. చిరుత సంచారం వెలుగులోకి రావటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. భయాందోళనకు గురి కావొద్దన్నారు. ఇబ్రహీంపూర్ అడవిలో నుంచి ఆకు తీసుకురావటంతో పాటు వేరే అవసరాలున్నా ఎవ్వరూ వెళ్లొద్దని హెచ్చరించారు. చిరుత పులి సంచరిస్తున్న కారణంగా ఇబ్రహీంపూర్ పరిధిలోని బోనాల గోవిందాపూర్, కిష్టాపూర్, పులిమామిడి, చిట్టోజ్ పల్లి, రుక్మాపూర్, రాంపూర్, కన్యారం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అడవిలోకి ఎవరూ వెళ్లొద్దన్నారు. నర్సరీలోకి వచ్చిన చిరుత నీరు తాగి అక్కడే కొద్దిసేపు సేద తీరినట్టు అధికారులు గుర్తించారు. అక్కడ ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్స్ లో?. ఒక చుక్కల జింక కూడా వచ్చినట్లు రికార్డు అయింది. నీరు తాగి వెళ్లినట్లు గుర్తించారు. చిరుత పులి( దాడిలో ఆవు మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం మాణిక్ నాయక్ తండా శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. తండా వాసులు తెలిపిన వివరాల ప్రకారం? మాణిక్ నాయక్ తండాకు చెందిన కిషన్ రోజులాగానే తన పశువులను మంగళవారం సాయంత్రం తర్వాత బావి దగ్గర కట్టేసి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం వెళ్లి చూసేసరికి ఆవు రక్తపు గాయాలతో మృతి చెంది ఉంది. కాగా మరో రెండు పశువులు కూడా గాయాపడ్డాయి. చిరుత దాడిలోనే ఆవు మృతి చెందినట్లు అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. గత కొన్నేళ్లుగా తండా పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరిస్తూ పశువులను బలి తీసుకున్న సంఘటనలు ఉన్నాయని తండావాసులు భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఇదే మాణిక్ నాయక్ తండా శివారులోనే చిరుత దాడిలో ఓఆవు మృతిచెందిందని తెలిపారు. బాధితుడికి పరిహారం అందించడంతోపాటు చిరుతను వీలైనంత త్వరగా బంధించాలని తండా వాసులు కోరుతున్నారు.



# బాత్ పిక్

తెచ్చిన తంటామనకు పెద్దగా కనిపించని విషయం.. పక్క వాళ్లకు భూతద్దంలో కనిపించవచ్చు. అందుకే మన చర్యల పరిణామాలను ముందుగా పసిగట్టి జాగ్రత్త తీసుకోవాలి. ఈ విషయంలో కొందరు సినీ సెలబ్రిటీలు పీక్. తొందరపడి పోస్టులు పెట్టేయడం, తర్వాత నాలిక కరుచుకోవడం. చాలామంది విషయంలో ఇది పరిపాటైపోయింది. నిరంతరం వార్తల్లో ఉండే స్టార్ హీరోయిన్ సమంత.. టవల్ కట్టుకొని ఇన్ఫ్రారెడ్ ఆవిరి బాత్ చేస్తున్న పిక్ ఒకటి తాజాగా పోస్టు చేసింది. ఆ పోస్ట్‌లో ఈ బాత్ వల్ల కలిగే ప్రయోజనాలను కూడా రాసింది. ఏమనుకుందో ఏమో.. అంతలోనే పోస్ట్‌ను డిలీట్ చేసేసింది. అయితే ఈ కొద్ది సమయంలోనే ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. కొందరు ఆకతాయిలైతే సమంత పోస్ట్ చేసిన పిక్‌ను మార్ఫింగ్ చేసి, ఇబ్బందికరంగా చూపిస్తూ వైరల్ చేశారు. సామ్ అభిమానులేమో ఒరిజినల్ పిక్‌ను వైరల్ చేస్తున్నారు. ఏదేమైనా మొత్తంగా బూమరాంగ్ అయ్యింది. ఈ నేపథ్యంలో సమంత పరోక్షంగా స్పందిస్తూ.. 'మిమ్మల్ని మీరు సమర్థించుకోవాల్సిన అవసరం లేకుండా.. నిరూపించుకోవాల్సిన అవసరం రాకుండా జీవించడమే నిజమైన విజయం' అనే కొటేషన్‌ని పోస్ట్ చేసింది. ఈ పిక్‌పై జరుగుతున్న రాద్ధాంతానికి ఫుల్‌స్టాప్ పెట్టడానికే సామ్ ఈ క్యాప్షన్ షేర్ చేసిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


# ఆసుపత్రిలో 'జాంబీ రెడ్డి' హీరోయిన్



టాలీవుడ్ హీరోయిన్ 'హుషారు', 'జాంబిరెడ్డి' సినిమాల ఫేమ్ దక్ష నగార్కర్ ఆసుపత్రిలో చేరినట్లు తెలుస్తుంది. తనకు ఏమైంది అనే విషయాన్ని బయట పెట్టకుండా ఇన్‌స్టా వేదికగా ఒక పోస్ట్ పెట్టింది ఈ భామ. గత కొన్ని రోజులుగా స్ట్రెచర్‌పై నాకు తెలియని వ్యక్తులతో సర్జరీ గదిలో ఉండటం చాలా కష్టంగా ఉంది. నాకు రెండు సార్లు వెన్నెముకపై అనస్థీషియా ఇచ్చారు. దాని నుంచి కోలుకోవడం చాలా కష్టంగా ఉంది. నేను నా భావోద్వేగాలన్నీంటినీ కంట్రోల్ చేసుకోడానికి ప్రయత్నించాను. నన్ను ప్రేమించే వ్యక్తులు నాకు సపోర్ట్ గా నిలిచారు. కష్టసమయంలో మనిషిని ఎలా ప్రేమించాలో చూపించారు. ప్రేమకు నిజంగా కనిపించని గాయాలను నయం చేసే శక్తి ఉంది. ఇలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదు. దయచేసి మిమ్మల్ని మీరు జాగ్రత్తగా చూసుకోండి. నేను సంతోషకరమైన విషయాలనే పోస్ట్ చేస్తున్నాను, ఎందుకంటే ఎవరూ బాధపడకూడదు కాబట్టి అని తెలిపింది.

# ఇండియన్ సినిమా రూపురేఖలు మార్చే 'కల్కి'

ప్రభాస్ 'కల్కి 2989 ఏడీ'లో తాను నటిస్తున్నట్టు వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని తేల్చి చెప్పేశారు టాలీవుడ్ హల్క్ రానా. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ భారీ పాన్ఇండియా సినిమాలో అమితాబ్, కమల్‌హాసన్, దీపికా పడుకొణే, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. వీళ్లతోపాటు రానా కూడా ఇందులో ముఖ్యభూమిక పోషిస్తున్నట్లు కొన్నాళ్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. వీటిపై తన తాజా ఇంటర్వ్యూలో వివరణ ఇచ్చారు రానా. 'నేనూ, డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఇద్దరం ఒకటో తరగతి నుంచీ ఫ్రెండ్స్. పైగా తను నా తొలి సినిమా 'లీడర్'కి శేఖర్ కమ్ముల దగ్గర అసిస్టెంట్ గా పనిచేశాడు. మా ఇద్దరి అనుబంధం ఈనాటిది కాదు. అందుకే విదేశాల్లో జరిగిన 'కల్కి' ప్రమోషన్స్‌లో పాల్గొన్నాను. దాంతో ఆ సినిమాలో నేనూ ఉన్నట్టు రాసేస్తున్నారు. నిజానికి 'కల్కి'లో నేను లేను. అయితే ఒక్కటి మాత్రం చెప్పగలను. 'కల్కి' సామాన్యమైన సినిమా కాదు. ఈ సినిమాతో ఇండియన్ సినిమా రూపురేఖలు మారనున్నాయి. 'ఎవెంజర్స్' స్థాయి సినిమా అవుతుంది' అని చెప్పారు రానా.





# 'సత్య'.. ఇంట్రెస్టింగ్‌గా ట్రైలర్


తమిళ నటులు అమరేశ్, ప్రార్థన సందీప్ జంటగా నటించిన తాజా చిత్రం 'రంగోలి'. వాలీ మోహన్‌దాస్ దర్శకత్వంలో కె బాబు రెడ్డి, జి సతీష్‌కుమార్ నిర్మించిన ఈ సినిమా తమిళంలో మంచి విజయాన్ని అందుకుంది. ఇక ఇదే సినిమాను తెలుగులో 'సత్య' అనే పేరుతో సీనియర్ ఫొటో జర్నలిస్ట్ శివ మల్లాల శివమ్ మీడియా పేరుతో చిత్రనిర్మాణ సంస్థను స్థాపించి తొలి ప్రయత్నంగా ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. మే 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మూవీ నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. ప్రతీ తండ్రీ తన కొడుకుకు ఏమిద్దామా అని ఆలోచించే సొసైటీ మనది. అలాంటి సొసైటీలో నా వల్ల అమ్మానాన్నలు ఇబ్బంది పడకూడదు అని ఆలోచించే కొడుకు కథతో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఇక ఫాదర్ సెంటిమెంట్ తో వస్తున్న ఈ ట్రైలర్ ప్రస్తుతం ఆకట్టుకుంది. మరోవైపు ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ 'యు' సర్టిఫికెట్‌ను అందజేసింది.



# తగ్గేదే లే.. ప్రియమణి..!

ఎవరే అతగాడు సినిమాతో తొలిసారి సిల్వర్ స్క్రీన్‌పై మెరిసింది ప్రియమణి. పెళ్లైన కొత్తలో సినిమాతో మంచి బ్రేక్ అందుకుంది. ఆ తర్వాత నాగార్జున, జగపతిబాబు, రవితేజ, జూనియర్ ఎన్టీఆర్, గోపీచంద్ లాంటి హీరోలతో సక్సెస్‌ఫుల్ చిత్రాల్లో నటించింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా ఏ మాత్రం తగ్గేదేలే అనే ఫార్ములాను అప్లై చేస్తోంది. సౌత్‌లో టాప్ స్టార్లతో కలిసి నటించి టాప్ హీరోయిన్‌గా నిలిచింది. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ దేశంలోనే వన్ ది టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలుగుతోంది. వచ్చే రెండేళ్ల పాటు తన డేట్స్ అన్ని ఫుల్ అయ్యాయంటే ప్రియమణి ఎంత బిజీగా ఉందో అర్థమవుతుంది. ఇక ఓటీటీ సినిమాల విషయానికొస్తే ఈ భామ దర్శకనిర్మాతలకు మోస్ట్ వాంటెడ్ సెలబ్రిటీగా మారిపోయింది. చివరగా ఓటీటీ ప్రాజెక్ట్ భామాకలాపం 2తో ప్రేక్షకుల ముందుకొచ్చిన ప్రియమణి.. తాజాగా మోస్ట్ ఎవెయిటెడ్ అమెజాన్ ప్రైమ్ వీడియో షో ది ఫ్యామిలీ మ్యాన్ 3 షూటింగ్ కూడా మొదలు పెట్టింది. అజయ్ దేవ్‌గన్ నటించిన మైదాన్ సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. ప్రస్తుతం తమిళంలో కొటేషన్ గ్యాంగ్‌లో నటిస్తుండగా.. షూటింగ్ పూర్తి చేసుకుంది. మరోవైపు కన్నడలో Khaimara చిత్రంలో నటిస్తోంది. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ. కన్నడ భాషల్లో సినిమాలు చేస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ప్రియమణి ది ఫ్యామిలీ మ్యాన్ 3తో ఎలా ఎంటర్‌టైన్ చేస్తుందో చూడాలంటున్నారు సినీ జనాలు. మొత్తానికి పెళ్లికి ముందు పెళ్లి తర్వాత నో రెస్ట్ అంటూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది.

# నగరాల్లో ఆస్తుల విలువ రెట్టింపు ఆ కారణాల వల్లే ధరల జాతర షురూ



మెట్రోపాలిటన్ నగరాల్లో ఆర్థిక కార్యకలాపాలు, సాంస్కృతిక వైవిధ్యం, డైనమిక్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లకు కేంద్రాలుగా పని చేస్తాయి. ఈ నగరాలకు సంబంధించి అధిక జీవన వ్యయం, ప్రత్యేకించి మెట్రోయేతర ప్రాంతాలతో పోలిస్తే గృహాల ధరలలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ ప్రీమియం పట్టణ సౌలభ్యం, సౌకర్యాలకు యాక్సెసిబిలిటీ, మెరుగైన అవకాశాల వాగ్దానాలపై ఉంచిన స్వాభావిక విలువను ప్రతిబింబిస్తుంది. భారతదేశంలో ఇటీవల కాలంలో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెట్టే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుంటుంది. మెట్రోపాలిటన్ నగరాల్లో ఆర్థిక కార్యకలాపాలు, సాంస్కృతిక వైవిధ్యం, డైనమిక్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లకు కేంద్రాలుగా పని చేస్తాయి. ఈ నగరాలకు సంబంధించి అధిక జీవన వ్యయం, ప్రత్యేకించి మెట్రోయేతర ప్రాంతాలతో పోలిస్తే గృహాల ధరలలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ ప్రీమియం పట్టణ సౌలభ్యం, సౌకర్యాలకు యాక్సెసిబిలిటీ, మెరుగైన అవకాశాల వాగ్దానాలపై ఉంచిన స్వాభావిక విలువను ప్రతిబింబిస్తుంది. భారతీయ మెట్రో నగరాల్లో గృహాల ధరలను ప్రభావితం చేసే కారకాలపై మా అవగాహనను విస్తరించడం భావి కొనుగోలుదారులకు, అనుభవజ్ఞులైన పెట్టుబడిదారులకు అవసరం. ఈ నేపథ్యంలో మెట్రో నగరాల్లో ధరల పెరుగుదల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. మెట్రో కారిడార్లు మెట్రో కారిడార్ల అభివృద్ధి, విస్తరణ భారతీయ మెట్రో నగరాల్లో గృహాల ధరలను రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా కనెక్టివిటీని సులభతరం చేయడమే కాకుండా మెట్రో కారిడార్‌ల వెంబడి ఉన్న ప్రాంతాలు కీలకమైన వాణిజ్య కేంద్రాలు, ఉపాధి కేంద్రాలు, విద్యాసంస్థలు, వినోద సౌకర్యాలకు అనువుగా ఉండడంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అలాగే భవిష్యత్ మెట్రో విస్తరణల అంచనా తరచుగా పక్కనే ఉన్న ప్రాంతాల్లో ముందస్తు పెట్టుబడులను ప్రేరేపిస్తుంది. అందువల్ల భూమి ధరలు విపరీతంగా పెరుగుతాయి. మెట్రో కారిడార్ అభివృద్ధికి సంబంధించిన అధ్యయనాలు మెట్రో స్టేషన్‌లకు సామీప్యత మరియు ప్రాపర్టీ అప్రిసియేషన్ రేట్ల మధ్య సానుకూల సంబంధాన్ని సూచిస్తున్నాయి.

## మారుతీకి విక్రయాల జోష్!




**న్యూఢిల్లీ :** జనవరి–మార్చి త్రైమాసికంలో మారుతీ సుజుకీ ఇండియా నికర లాభం 47.8 శాతం పెరిగి రూ.3,877.70 కోట్లుగా నమోదైంది. కిందటేడాది ఇదే సమయంలో నికర లాభం రూ.2,623.60 కోట్లుగా ఉంది. అధిక విక్రయాలు, కమొడిటీ ధరల సానుకూలతలు, వ్యయ నియంత్రణ చర్యలు లాంటివి లాభంలో వృద్ధికి దోహదం చేశాయని కంపెనీ తెలిపింది. 2023–24లో మారుతీ తొలిసారిగా 20 లక్షల వాహనాల వార్షిక విక్రయాలను నమోదు చేసింది. అలాగే పూర్తి ఆర్థిక సంవత్సరానికి నికర లాభం రూ.13,209.40 కోట్లకు చేరగా.. 2022–23లోని రూ.8,049.20 కోట్లతో పోలిస్తే 64 శాతం పెరిగింది. వరుసగా మూడో సంవత్సరం కూడా అగ్రగామి ఎగుమతిదారుగా మారుతీ నిలిచింది. 2023–24లో కంపెనీ మొత్తం వాహన విక్రయాలు 8.6 శాతం పెరిగి 21,35,323 వాహనాలుగా నమోదయ్యాయి. ఇందులో దేశీయ విక్రయాలు 18,52,256 వాహనాలు కాగా.. ఎగుమతులు 2,83,067 వాహనాలుగా ఉన్నాయి. 2023–24లో నికర విక్రయాలు రూ.1,34,937.80 కోట్లుగా నమోదయ్యాయి. 2022–23లోని రూ.1,12,500.80 కోట్లతో పోలిస్తే 19.9 శాతం పెరిగాయి. జనవరి– మార్చి విషయానికొస్తే... మారుతీ మొత్తం విక్రయాలు 13.4 శాతం పెరిగి 5,84,031 వాహనాలకు చేరాయి. దేశీయ విక్రయాలు 5,05,291 వాహనాలుగా నమోదయ్యాయి. ఎగుమతులు 78,740 వాహనాలు కాగా.. ఏడాదిక్రితం ఇదే త్రైమాసికంలో ఎగుమతి చేసిన 64,719 వాహనాలతో పోలిస్తే 21.7 శాతం పెరిగాయి. నికర విక్రయాలు రూ.30,821.80 కోట్ల నుంచి రూ.36,697.50 కోట్లకు పెరిగాయి.రూ.5 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.125 (2500%) డివిడెండును డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. కంపెనీ చరిత్రలో ఇదే అత్యధికం కావడం విశేషం.


## ఈ కియా కారు జెట్ స్పీడ్‌లో దూసుకుపోతుందిగా..!




దక్షిణ కొరియాకు చెందిన కార్ల తయారీ సంస్థ కియా ఇండియాకు చెందిన ప్రముఖ కారు సోనెట్ విక్రయాల పరంగా రికార్డు సృష్టించింది. సోనెట్ 44 నెలల్లోపు 4 లక్షల విక్రయాల మార్కును అధిగమించి ఒక ముఖ్యమైన మైలురాయిని అధిగమించిందని కార్ల తయారీ సంస్థ ప్రకటించింది. గమనించదగ్గ విషయం ఏమిటంటే, ఈ అమ్మకాల గణాంకాలలో దేశీయ, విదేశీ మార్కెట్లు ఉన్నాయి. దేశీయంగా 3,17,754 యూనిట్లు విక్రయించగా.. 85,814 యూనిట్లు ఎగుమతి కాగా, మొత్తం అమ్మకాలలో సోనెట్ వాటా 33.3 శాతం. కంపెనీ కియా సోనెట్ ఫేస్‌లిఫ్ట్‌ను జనవరి 2024లో భారతదేశంలో ప్రారంభించింది. కియా ఇండియా అందించిన సమాచారం ప్రకారం.. ప్రారంభించిన 44 నెలల్లో 63 శాతం కంటే ఎక్కువ మంది వినియోగదారులు సన్‌రూఫ్‌తో కూడిన సోనెట్ వేరియంట్‌ను ఇష్టపడుతున్నారు. సోనెట్ 1.5–లీటర్ డీజిల్ ఇంజన్ దాని కస్టమర్లలో 37 శాతం మంది ఇష్టపడుతున్నారు.

## ఉద్యోగుల్లో 'డ్రై ప్రమోషన్' అంటే ఏమిటి?

ఏప్రిల్ నెల ముగియడానికి కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. సాధారణంగా ఉద్యోగస్తులు ఈ నెల కోసం చాలా వేచి ఉంటారు. ఎందుకంటే వారి జీతం కూడా పెరుగుతుందని ఆశిస్తుంటారు. మదింపు ఫారమ్‌ల నింపడం తప్పనిసరిగా మీ కార్యాలయంలో కూడా ప్రారంభించబడి ఉండాలి. ప్రమోషన్, ఇంక్రిమెంట్, అప్రైజల్, రోల్ చేంజ్ లాంటి పదాలు ఈ రోజుల్లో ప్రతి ఆఫీసులో వినిపిస్తున్నాయి. అయితే ఈ మదింపు సమయంలోనే ఉద్యోగుల్లో ఓ వింత భయం మొదలైంది. ఆ భయం 'డ్రై ప్రమోషన్', ఈ డ్రై ప్రమోషన్ ఏమిటో తెలుసుకుందాం. ఈ రోజుల్లో ఉద్యోగులు జాబ్ మార్కెట్‌లో ప్రమోషన్ గురించి ఆసక్తిగా ఉన్నారు. దీనికి కారణం ఈరోజుల్లో డ్రై ప్రమోషన్ అనే ట్రెండ్ మొదలైంది. వాస్తవానికి, డ్రై ప్రమోషన్ అనేది ఉద్యోగి తన పోస్ట్ లేదా హోదాను పెంచడం ద్వారా బహుమతి పొందే పరిస్థితి. అయితే దీనితో జీతం పెరగదు ఉంటుంది. దీని కారణంగా మీ పోస్ట్ మారుతుంది. మీకు ప్రమోషన్ వస్తుంది. పని లక్ష్యాలు కూడా మారుతాయి. కార్యాలయ బాధ్యతలు కూడా పెరుగుతాయి. కానీ డబ్బు పరంగా అది తదనుగుణంగా జరగదు. ప్రణాళికా సలహా సంస్థ పెర్ల్ మేయర్ ప్రకారం, కంపెనీలు తమ ప్రతిభను తక్కువ బడ్జెట్‌లో నిర్వహించడం వల్ల డ్రై ప్రమోషన్ పరిస్థితి ఈ రోజుల్లో సర్వసాధారణంగా మారింది. డేటా ప్రకారం.. ఈ సంవత్సరం 13 శాతం సంస్థలు తమ ఉద్యోగులకు కొత్త ఉద్యోగాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఉద్యోగులకు ప్రమోషన్లు, ప్రోత్సహకాలు, రివార్డ్‌లు ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదిక ప్రకారం.. ఈ సంఖ్య 2018 సంవత్సరంలో 8 శాతం ఉండేది. ఇది ఇప్పుడు 13 శాతానికి చేరింది. చాలా మంది ఉద్యోగులకు,



డ్రై ప్రమోషన్ చాలా నిరాశపరిచింది. రిట్రెంచ్‌మెంట్ కారణంగా వ్యక్తులు, ఉద్యోగులను తగ్గించే భయం కారణంగా, కంపెనీలు పోస్ట్‌లను మార్చడానికి ఎంచుకుంటాయి.

## బలవంతం చేస్తే భారత్ నుంచి వెళ్లిపోతాం....!
## ఢిల్లీ హైకోర్టుతో వాట్సాప్...!




మెటా యాజమాన్యంలో మెసేసింగ్ యాప్ వాట్సాప్, కేంద్ర ప్రభుత్వానికి మధ్య చాలాకాలంగా యుద్ధమే జరుగుతున్నది. ప్రస్తుతం ఈ పోరు తుది దశకు చేరుకున్నది. మెసేజ్‌ల ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ విషయంలో బలవంతం చేస్తే భారత్‌ను వీడాల్సి వస్తుందని ఢిల్లీ హైకోర్టుకు స్పష్టం చేసింది. కేంద్రం తీసుకువచ్చిన 2021 నాటి ఐటీ నిబంధనలు సవాల్ చేస్తూ వాట్సాప్, మెటా కంపెనీలు గతంలో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఆయా పిటిషన్లపై గురువారం ఢిల్లీ కోర్టు విచారణ జరిపింది. ఐటీ నిబంధనల ప్రకారం.. ప్రభుత్వం కోరిన సమయంలో సందేశాల ఎన్‌క్రిప్షన్ తొలగించి సమాచార మూలాలు బహిర్గతం చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు కేంద్రం ఐటీ టెక్నాలజీ (ఇంటర్మీడియరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) పేరిట మార్గదర్శకాలను జారీ చేసింది. ఏదైనా మెసేజ్ వాట్సాప్‌లో ఎక్కడి వచ్చింది.. ఎవరు ఎవరికి పంపారనే వివరాలు ప్రభుత్వం అడిగిన సమయంలో ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ కుదరదని మెటా కంపెనీలు స్పష్టం చేశాయి. ప్రభుత్వం ఏ సమాచారం కోరుతుందో ముందుగానే తెలియదని.. కోరిన సమయంలో డీక్రిప్ట్ యడానికి కోట్లాది సందేశాలను ఏళ్ల తరబడిగా స్టోర్ చేయాల్సి ఉంటుందని కోర్టుకు తెలిపింది. ఈ విషయమై వాదులు, ప్రతివాదుల మధ్య చర్చలు జరగాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది.

## బలవంతం చేస్తే వాట్సాప్ సేవలు బంద్..! ఢిల్లీ హైకోర్టుకు మెటా వెల్లడి



**న్యూఢిల్లీ :** వినియోగదారుల గోప్యతకు భంగం కలిగించలేమని వాట్సాప్ యాప్ మాతృసంస్థ మెటా స్పష్టం చేసింది. మోడీ సర్కార్ 2021లో తీసుకువచ్చిన ఐటి నిబంధనలను సవాల్ చేస్తూ వాట్సాప్, మెటా కంపెనీలు గతంలో పిటిషన్లు దాఖలు చేశాయి. ఆయా పిటిషన్లపై గురువారం ఢిల్లీ కోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వైఖరీపై మెటా ధీటుగా సమాధానం చెప్పింది. మెసేజ్‌ల ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ విషయంలో బలవంతం చేస్తే భారత్‌ను వీడాల్సి వస్తుందని స్పష్టం చేసింది. వినియోగదారుల సమాచారానికి గోప్యత లేకుండా కేంద్ర ఐటి శాఖ ఇంటర్మీడియరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్ పేరిట మార్గదర్శకాలను జారీ చేసిందని తెలిపింది. కొత్త ఐటి నిబంధనలు–2021లోని 4(2) సెక్షన్ ప్రకారం.. సోషల్ మీడియాలో ఏదైనా మెసేజ్ ఎక్కడి నుంచి వచ్చింది.. ఎవరు ఎవరికి పంపారనే వివరాలు ప్రభుత్వం అడిగిన సమయంలో ఇవ్వాల్సి ఉంటుంది. భారత ప్రభుత్వ వైఖరిని వాట్సాప్ కంపెనీ సవాలు చేస్తోంది. ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ కుదరదని స్పష్టం చేసింది. ప్రభుత్వం ఏ సమాచారం కోరుతుందో ముందుగానే తెలియదని.. కోరిన సమయంలో డీక్రిప్ట్ చేయడానికి కోట్లాది సందేశాలను ఏళ్ల తరబడిగా భద్రపర్చాల్సి ఉంటుందని కోర్టుకు తెలిపింది. "ఈ 4(2) సెక్షన్ నిబంధన వ్యక్తుల గోప్యతకు వ్యతిరేకం. రాజ్యాంగ విరుద్ధం. సామాజిక మాధ్యమ సంస్థలతో ఎలాంటి సంప్రదింపులు లేకుండానే దీన్ని ప్రవేశపెట్టారు. దీని వల్ల మేం కోట్లాది మెసేజ్‌లను కొన్నేళ్ల పాటు భద్రపర్చాల్సి ఉంటుంది. ఇలాంటి నిబంధన ప్రపంచంలో ఎక్కడా లేదు" అని వాట్సప్ తరఫు న్యాయవాదులు వాధించారు. ప్రస్తుతం ఇలాంటి చట్టం మరే దేశంలోనైనా అమలులో ఉందా? అన్న ప్రశ్నకు బ్రెజిల్ లాంటి దేశాల్లో సైతం ఈ రూల్స్ లేవని మెటా తరఫున న్యాయవాదులు తెలిపారు. ఎన్‌క్రిప్షన్ ఫీచర్ విషయంలో రాజీ పడితే భారత రాజ్యాంగం ప్రకారం వినియోగదారుల గోప్యతా హక్కులను ఉల్లంఘించినట్లు అవుతుందని వాధించింది. గోప్యత అనేది ప్రాథమిక హక్కు అని వాట్సాప్ నమ్ముతుందని, బలమైన ఎన్‌క్రిప్షన్ స్టాండర్స్‌తో ఆ హక్కులను కాపాడటానికి ప్రయత్నిస్తున్నామని తెలిపింది. వాట్సాప్ ఇతర దేశాలలో కూడా ఇలాంటి డిమాండ్లను ఎదుర్కొంది. మెసేజ్‌ల ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ విషయంలో బలవంతం చేస్తే భారత్‌ను వీడాల్సి వస్తుందని స్పష్టం చేసింది. వినియోగదారుల సమాచారానికి గోప్యత లేకుండా కేంద్ర ఐటి శాఖ ఇంటర్మీడియరీ గైడ్‌లైన్స్ అండ్ డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్ పేరిట మార్గదర్శకాలను జారీ చేసిందని తెలిపింది.

## మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడితో మీరే కోటీశ్వరులు.. ఆ ఫార్ములా పాటించడం మస్ట్




ముఖ్యంగా మ్యూచువల్ ఫండ్స్ ప్రారంభ, అనుభవజ్ఞులైన పెట్టుబడిదారులకు సమతుల్య విధానాన్ని అందిస్తుంది. మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడిదారులకు అనేక కీలక ప్రయోజనాలను అందిస్తాయి. మ్యూచువల్ ఫండ్స్ తక్షణ వైవిధ్యతను అందిస్తాయి. పెట్టుబడిదారుడి డబ్బు అనేక సెక్యూరిటీలలో వ్యాపించి, మొత్తం రిస్క్ ఎక్స్‌పోజర్‌ను తగ్గిస్తుంది. ఇవి అనేక వనరులను కలిగి ఉన్న అనుభవజ్ఞులైన నిపుణులు నిర్వహిస్తారు. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడం అనేది మీ డబ్బును పెంచుకోవడానికి ఒక తెలివైన మార్గంగా పరిగణించాలని నిపుణులు సూచిస్తూ ఉంటారు. ముఖ్యంగా మ్యూచువల్ ఫండ్స్ ప్రారంభ, అనుభవజ్ఞులైన పెట్టుబడిదారులకు సమతుల్య విధానాన్ని అందిస్తుంది. మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడిదారులకు అనేక కీలక ప్రయోజనాలను అందిస్తాయి. మ్యూచువల్ ఫండ్స్ తక్షణ వైవిధ్యతను అందిస్తాయి. పెట్టుబడిదారుడి డబ్బు అనేక సెక్యూరిటీలలో వ్యాపించి, మొత్తం రిస్క్ ఎక్స్‌పోజర్‌ను తగ్గిస్తుంది. ఇవి అనేక వనరులను కలిగి ఉన్న అనుభవజ్ఞులైన నిపుణులు నిర్వహిస్తారు. అలాగే పెట్టుబడిదారులు తమ ఫండ్ షేర్లను ప్రస్తుత నికర ఆస్తి విలువ (%హీూ౦%) వద్ద సులభంగా కొనుగోలు చేయవచ్చు లేదా విక్రయించవచ్చు, ఇది ప్రతి ట్రేడింగ్ రోజు చివరిలో నిర్ణయిస్తారు.

# దీదీ సర్కారుకు సుప్రీం సూచన



న్యూఢిల్లీ : పశ్చిమబెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంపై సుప్రీం కోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా బెంగాల్ ప్రభుత్వానికి కఠిన ప్రశ్నలు సంధించింది. ఎంపిక ప్రక్రియ అంశం కోర్టులో ఉండగానే కొత్త పోస్టులు సృష్టించి నియామకాలు ఎలా చేపట్టారని ప్రశ్నించింది. వ్యవస్థపై ప్రజలు నమ్మకాన్ని కోల్పోతే ఆ పరిస్థితిని ఎలా ఎదుర్కొంటారని ఆగ్రహించింది.

బెంగాల్లో 2016 నాటి స్టేట్ లెవల్ సెలక్షన్ టెస్ట్ నియామక ప్రక్రియ చెల్లదని ఇటీవల కలకత్తా హైకోర్టు కీలక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఈ క్రమం లోనే 25, 743 మంది టీచర్లు , నాన్‌టీచింగ్ సిబ్బంది నియామకాలను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వం లోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా దీదీ సర్కారు తీరుపై అసహనం వ్యక్తం చేసింది. “ ఇది వ్యవస్థీకృత మోసమే. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వ ఉద్యోగుల నియామకాల్లో అవతవకలు జరిగితే , వ్యవస్థలో ఇంకేం మిగులుతుంది? వ్యవస్థపై ప్రజలు విశ్వాసాన్ని కోల్పోతే దాన్ని మీరు ఎలా ఎదుర్కొంటారు? ప్రజల నమ్మకం పోతే ఇంకేం మిగలదు” అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా నియామక ప్రక్రియకు సంబంధించిన డేటాను ఎందుకు భద్రపర్చలేదంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. .“ ఆ డేటా ఉందా లేదా ? నియామక ప్రక్రియకు సంబంధించిన అన్ని పత్రాలను డిజిటల్ రూపంలో భద్ర పర్చడం స్కూల్ సర్వీస్ కమిషన్ బాధ్యత ” అని గుర్తు చేసింది. ప్రభుత్వ ప్రాయోజిత , ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతోపాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్రస్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన రిక్రూట్ మెంట్ పరీక్షకు 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు. ఇందులో అవకతవకలు జరిగినట్టు అప్పట్లోనే ఆరోపణలు రాగా, ఈ వ్యవహారం కోర్టుకు చేరింది. ఆ అంశం పెండింగ్‌లో ఉండగానే అందులో ఎంపిక ప్రక్రియను చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఖాళీల కంటే అదనంగా కొంతమందిని నియమించడంపై వివాదాస్పదమైంది. ఈ క్రమం లోనే నాటి నియామక ప్రక్రియను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది.

# అవినీతిపరులను ప్రోత్సహిస్తున్న బిజెపి



**చిర్మిరి(ఛత్తీస్‌గఢ్):** అవినీతిపరులను, ప్రజా సంక్షేమం పట్టని వారిని మాత్రమే బిజెపి ప్రోత్సహిస్తుందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా విమర్శించారు. ప్రజలకు 5 కిలోల రేషన్ ఇచ్చి వారు తమపైన ఆధారపడాలన్నది బిజెపి ఆలోచనని, ప్రజలు దీనికి బదులుగా ఉద్యోగాలు కోరాలని ఆమె సూచించారు. ఛత్తీస్‌గఢ్‌లోని మహేంద్రగఢ్-చిర్మిరి-భరత్‌పూర్ జిల్లాలోని చిర్మిరి పట్టణంలో మంగళవారం ఒక ఎన్నికల సభలో ఆమె ప్రసంగిస్తూ దేశానికి చెందిన ఆస్తులను నరేంద్ర మోడీ ప్రభుత్వం కొందరు కోటీశ్వరులకు కట్టబెడుతోందని ఆరోపించారు. దేశంలో ఎటువంటి రాజకీయాలు జరుగుతున్నాయి, దేశంపై ఏరకంగా దాడి జరుగుతోంది, ఎటువంటి నాయకులను పెంచిపోషిస్తున్నారో దేశ ప్రజలు తెలుసుకోవలసిన అవసరం ఉందని ఆమె అన్నారు. రెండు రకాల నాయకులను బిజెపి పెంచిపోషిస్తోందని, ఒకరు అత్యంత అవినీతిపరులని ఆమె తెలిపారు. అవినీతిపరులైన నాయకులందరినీ ఒకచోటకు చేర్చి తమ శిబిరంలోకి బిజెపి తీసుకుంటోందని ఆమె చెప్పారు. ఇతర పార్టీలలోని అవినీతి నాయకులపై మొదట ఆరోపణలు చేస్తారని, వారిపైన ఒత్తిడి పెట్టి వారిని బిజెపిలోకి రప్పించుకుంటారని ఆమె చెప్పారు. బిజెపిలో చేఇరన తర్వాత వారంతా నిజాయితీపరులై పోతారని, వారిపైన ఎటువంటి కేసులు ఉండవని ప్రియాంక తెలిపారు. ఇక రెండవ రకం నాయకులు వారు ప్రజా సమస్యల గురించి ఎక్కడా మాట్లాడరని ఆమె అన్నారు. ధరల పెరుగుదల గురించి, ప్రజలు ఎందుర్కొంటున్న సవాళ్ల గురించి వారు మాట్లాడరని ఆమె అన్నారు. ఈ రెండు రకాల నాయకులనే బిజెపి ప్రోత్సహిస్తుందని ఆమె చెప్పారు. కాని కాంగ్రెస్ పార్టీలో ప్రజల కష్టాలను అర్థం చేసుకుని వారి కోసం పనిచేసే వారినే ప్రోత్సహిస్తున్నామని ఆమె తెలిపారు. ప్రజలు ఒకపక్క తీవ్ర కష్టాలు ఎదుర్కొంటుంటే బిజెపి మాత్రం జి20, పాకిస్తాన్, చైనా వంటి భారీ ఈవెంట్లు నిర్వహిస్తుందని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోకు న్యాయ పత్ర అని పేరు పెట్టిందని, పదేళ్ల నరేంద్ర మోడీ పాలనలో ప్రజలకు న్యాయం ఏమైనా జరిగిందా అని ప్రియాంక ప్రశ్నించారు. పారిశ్రామికవేత్తలు, బడా నాయకులు మాత్రమే బాగుపడ్డారని ఆమె విమర్శించారు. 5 కిలోల ఉచిత రేషన్, మతం పేరు చెప్పుకుని మాత్రమే బిజెపి ప్రజలను ఓట్లు అడుగుతోందని ఆమె ఆరోపించారు. అధికార బిజెపిని 30 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయమని ప్రజలు అడగాలని ఆమె పిలుపునిచ్చారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రస్తావిస్తూ ప్రపంచంలోనే ఇది అత్యంత భారీ కుంభకోణమని ఆమె ఆరోపించారు. తాను మాత్రమే నిజాయితీపరుడినని, అవినీతిపై పోరాడుతున్నానని ప్రధాని మోడీ గొప్పలు చెప్పుకుంటుంటారని ఆమె విమర్శించారు. మోడీ నిజాయితీవరుడేనని, కాని ప్రజల సమస్యల గురించి నిజాయితీగా మాట్లాడరని, ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో, ఎన్ని యూనివర్సిటీలు, ఆసుపత్రులు, స్కూళ్లు నిర్మించారో నిజాయితీ చెప్పరని ఆమె వ్యంగ్యంగా అన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని కొందరు బిజెపి నాయకులు చెబుతున్నారని ఆమె ఆరోపించారు.

# ముస్లింలకు కోటా కోసం రాజ్యాంగం మార్పు



న్యూఢిల్లీ : ముస్లిం కోటాపై ఆర్‌జెడి చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన పక్షంలో రాజ్యాంగం మౌలిక వ్యవస్థలో మార్పుల ద్వారా మైనారిటీ వర్గానికి రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తుందని స్పష్టం చేశాయని బిజెపి మంగళవారం ఆరోపించింది. ముస్లింలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పనకు తాను సుముఖమని ఆర్‌జెడి అధ్యక్షుడు ప్రకటించిన తరువాత ప్రతిపక్ష కూటమిపై బిజెపి ఆ ఆరోపణ చేసింది. బిజెపి జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది న్యూఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల గోష్ఠిలో మాట్లాడుతూ, ‘ముస్లింకు పూర్తిగా రిజర్వేషన్లు కల్పించనున్నట్లు లాలూ ప్రసాద్ యాదవ్ చెప్పారు. ‘ఆయన తన ప్రకటనలో వాడిన ‘పూరా కా పూరా’ పదం చాలా తీవ్రమైనది. ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఒబిసిల వాటాలో నుంచి ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని వారు (ఇండియా కూటమి) కోరుకుంటున్నట్లు అది స్పష్టం చేస్తున్నది’ అని అన్నారు. ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఒబిసిల వాటాలో నుంచి ముస్లింలకు రిజర్వేషన్ల కల్పనకు రాజ్యాంగాన్ని మార్చాలన్న ఇండియా కూటమి ప్లాన్ గురించి ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి వ్యక్తం చేస్తున్న అనుమానాలు లాలూ ప్రకటన బట్టి నిజమని తేలుతోందని త్రివేది చెప్పారు. ‘ఆర్‌జెడికి ముస్లింలే ప్రధానమని, యాదవ్‌లకు అంత ప్రాముఖ్యం లేదని కూడా ఆ ప్రకటన స్పష్టం చేస్తున్నది’ అని త్రివేది ఆరోపించారు. మతం ఆధారంగా రిజర్వేషన్ కల్పించరాదని రాజ్యాంగం స్పష్టం చేస్తున్నదని బిజెపి అధికార ప్రతినిధి చెప్పారు. ‘ముస్లింలకు రిజర్వేషన్ కల్పన కోసం రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చాలని వారు కోరుకుంటున్నారు’ అని ఆయన ఆరోపించారు. తమ కూటమి అధికారంలోకి వస్తే ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా ఇండియా కూటమిలోని పలువురు నేతలు చెబుతున్నారని త్రివేది తెలిపారు.

# ప్రభుత్వ పథకాలు ఆపాలని ఎన్నికల సంఘం ఆదేశాలు ఇవ్వలేదు : ముఖేష్‌కుమార్ మీనా



అమరావతి : ఏపీలో ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ పథకాలు ఆపాలని కేంద్ర ఎన్నికల సంఘం ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వెల్లడించారు. కొంతకాలం తరువాత ఇవ్వాలని ఆదేశించిందని పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో పోస్టల్ బ్యాట్ కోసం 4.30 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా 3.30 లక్షల మంది ఓటు హక్కును సద్వినియోగ పరుచుకున్నారని ఆయన వివరించారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌ను దాదాపు 70 శాతం పూర్తికాగా అవసరమైతే 9వ తేదీ వరకు పొడిగిస్తామని తెలిపారు. ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ కోసం20 రోజుల సమయాన్ని ఇచ్చామని, గడువు పెంపు సాధ్యం కాదని పేర్కొన్నారు. కొన్ని పథకాలకు నిధుల విడుదలపై కేంద్ర ఎన్నికల సంఘం వివరాలు మాత్రమే కోరిందన్నారు. నాయకులకు సెక్యూరిటీ ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా వెసులుబాటు కల్పిస్తామని ఆయన తెలిపారు.

# ఒడిశా పేదరికానికి బిజెడి కారణం: మోడీ



స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ల తర్వాత కూడా ఒడిశాను పేద రాష్ట్రంగా మారడానికి కాంగ్రెస్, బిజూ జనతా దళ్(బిజెడి) కారణమని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. సోమవారం నాడిక్కడ ఎన్నకల ప్రచారంలో భాగంగా ఒక ర్యాలీనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ ఒడిశాకు నీరు, సారవంతమైన భూమి, ఖనిజాలు, సుదీర్ఘమైన కోస్తా తీరం, చరిత్ర, సంస్కృతి.అన్నిటిని భగవంతుడు ఇచ్చాడని అన్నారు. అయినప్పటికీ ఒడిశా ప్రజలు ఎందుకు పదరికంలో మగ్గుతున్నారని ప్రధాని ప్రశ్నించారు. దీనికి సమాధానం మొదటి కాంగ్రెస్ నాయకులు లూటీ చేయగా తర్వాత బిజెడి నాయకులు లూటీ చేశారని ప్రధాని ఆరోపించారు. బిజెడికి చెందిన చిన్న నాయకులకు సైతం పెద్ద బంగళాలు ఉన్నాయని ఆయన చెపారు. గంజాం జిల్లాలో ఒక ప్రచార సభలో ప్రధాని ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న హింజిలి నియోజవకర్గం కూలీలు ఎందుకు ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారని ప్రశ్నించారు. ఇక్కడి ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్ పోస్టులు ఎందుకు ఖాళీగా ఉంటున్నాయని ప్రధాని నిలదీశారు. ఎందుకు పిల్లలు మధ్యలోనే స్కూళ్లను మానేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఒడిశా అభివృద్ధి కోసం నిధులు కేటాయించడానికి తాను ఎన్నడూ వెనుకాడలేదని ప్రధాని చెప్పారు. కేంద్రంలో సోనియా గాంధీ చేతిలో రిమోట్ కంట్రోల్ ఉన్న మన్మోహన్ సింగ్ పదేళ్ల పాటు అధికారంలో ఉన్నపుడు ఒడిశాకు పదేళ్లలో రూ. 1 లక్ష కోట్లు అందయాని, కాని తన ప్రభుత్వం పదేళ్లలో రూ. 3.5 లక్షల కోట్లు అందచేసిందని మోడీ చెప్పారు. అయితే నిధులు సమకూర్చినంత మాత్రాన అభివృద్ధి జరగదని కూడా ఆయన వ్యాఖ్యానించారు. మహిళల సంక్షేమం ఒడిశా ప్రభుత్వానికి పట్టలేదని ఆయన ఆరోపించారు. గర్భిణులకు నెలకు రూ. 6000 సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తోందని, ఈ ముఖ్యమైన పథకాన్ని ఒడిశా ప్రభుత్వం నిలిపివేసిందంటే మీరు ఆశ్చర్యపోతారని మోడీ తెలిపారు. జల్ జీవన్ మిషన్ కోసం రూ. 10,000 కోట్లను కేంద్రం పంపిస్తే ఆ నిధులను కూడా ఇక్కడి ప్రభుత్వం ఖర్చు చేయలేదని ఆయన చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో రోడ్ల నిర్మాణం కోసం మోడీ నిధులు పంపించినప్పటికీ రాష్ట్రంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఉచిత బియ్యం కోసం మోడీ డబ్బు పంపిస్తే బియ్యం పాకెట్లపై బిజెడి ప్రభుత్వం తన బొమ్మ వేసుకుంటుంది అని మోడీ విమర్శించారు. బిజెపిని అధికారంలోకి తీసుకురావాలని ఒడి శా ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశారని ప్రధాని తెలిపారు. జూన్ 4తో బిజెడి ప్రభుత్వానికి కాలం చెల్లిపోతుంది. ఒడిశా అభివృద్ధికి బిజెపి ఒక ఆశాకిరణం అని ఆయన అన్నారు. ఒడిశాలోని 21 లోక్‌సభ స్థానాలు, 147 అసెంబ్లీ స్థానాలకు ఏకకాలంలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా ఒడిశాలో తదుపరి ప్రభుత్వాన్ని బిజెపి ఏర్పాటు చేస్తుందన్న ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పందించారు. బిజెపి పగటి కలలు కంటోంది అంటూ ఆయన వ్యాఖ్యానించారు.

# నయ్యా సాగ్గిని ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా నియమించిన వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్



హైదరాబాద్: హోమ్ టెక్స్‌టైల్స్, ఫ్లోరింగ్ సొల్యూషన్స్ అండ్ అడ్వాన్స్‌డ్ టెక్స్‌టైల్స్‌లో అగ్రగామిగా ఉన్న వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్, తమ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా నయ్యా సాగ్గిని నియమించినట్లు వెల్లడించింది. 2024 ఏప్రిల్ 25 నుండి ఈ నియామకం అమల్లోకి రానుంది. ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా తొలుత నాలుగు సంవత్సరాల పాటు సాగ్గి కొనసాగుతారు. ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా ఆమె పదవీకాలం 2028 ఏప్రిల్ 24తో ముగుస్తుంది. ఈసందర్భంగా నయ్యా సాగ్గి నియామకంపై వెల్‌స్పన్ లివింగ్ సీఈఓ అండ్ ఎండి దీపాలి గోయెంకా మాట్లాడుతూ%ౌ% నయ్యా చేరిక వెల్‌స్పన్ లివింగ్‌కు ఒక వ్యూహాత్మక మైలురాయిని సూచిస్తుందన్నారు. వినియోగదారుల కేంద్రీకృత పరిశ్రమలలో సాగిన ఆమె వ్యవస్థాపక ప్రయాణంలో ఆమె నైపుణ్యం, కొత్తదనాన్ని తెస్తుందన్నారు. నయ్యా వ్యూహాత్మక పరిజ్ఞానం, ముఖ్యంగా ఆమె బీ2సీ అండ్ ఇ కామర్స్ అనుభవం వెల్‌స్పన్ లివింగ్ బీ2సీ వృద్ధి పథాన్ని ముందుకు తీసుకువెళ్లనుందన్నారు. నయ్యా సాగ్గి తన నియామకంపై మాట్లాడుతూ%ౌ% వెల్‌స్పన్ లివింగ్ లిమిటెడ్‌లో ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా చేరడం ఒక గౌరవంగా భావిస్తున్నానన్నారు. శ్రేష్ఠత అండ్ ఆవిష్కరణల పట్ల వెల్‌స్పన్ నిబద్ధత ప్రశంసనీయమన్నారు. దాని నిరంతర విజయానికి దోహదపడాలని తాను ఎదురు చూస్తున్నానన్నారు. వినియోగదారు-కేంద్రీకృత పరిశ్రమల్లో తన అనుభవం, బ్రాండ్ బిల్డింగ్‌లో బలమైన డిజిటల్ డీఎన్ఏ తీసుకురావడం, లాభం, ఉద్దేశ్యంతో స్థిరమైన, సమగ్ర వృద్ధి పట్ల తన అభిరుచి, వెల్‌స్పన్ విలువలతో సంపూర్ణంగా సరిపోలతాయని తాను నమ్ముతున్నానన్నారు. వ్యూహాత్మక కార్యక్రమాలను నడపడానికి, వాటాదారుల కోసం విలువను సృష్టించడానికి బోర్డు, మేనేజ్మెంట్ టీంతో కలిసి పనిచేయటానికి ఎదురుచూస్తున్నానన్నారు.

# పోలింగ్ బూత్‌ల లూటీకి బీజేపీ యత్నం : అఖిలేశ్ యాదవ్



ఎటవా (యుపి) : మణిపూర్‌లో లోక్‌సభ నియోజక వర్గంలో పోలింగ్ బూత్‌లను కాజేయడానికి బీజేపీ కార్యకర్తలు ప్రయత్నిస్తున్నారని, అందుకనే విపక్షసభ్యులను పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారని సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ మంగళవారం ఆరోపించారు. ఈ లోక్‌సభ స్థానానికి మూడో దశలో మంగళవారం పోలింగ్ జరిగింది. మణిపూర్ నియోజక వర్గం లోని సైఫై (ఎటావా) వద్ద అఖిలేశ్ ఓటు వేశారు. ఈ స్థానం నుంచి అఖిలేశ్ యాదవ్ భార్య, ప్రస్తుత ఎంపీ డింపిల్ యాదవ్ పోటీలో ఉన్నారు. బీజేపీలో అధికారం కోసం అంతర్గత పోరు సాగుతోందని, అందుకనే ఆ నాయకులు స్వయం బుజ్జగింపు ప్రకటనలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. కొన్ని చోట్ల రిగ్గింగ్ జరుగుతోందని వివరించారు. కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం బలగాలను ఉపయోంచుకుంటోందని సమాచారం అందిందన్నారు. పోలింగ్ బూత్‌లకు బయట అధికారులు నియామకమయ్యారని ఆరోపించారు. కేంద్రం ప్రతిపాదించిన మూడు కొత్త వ్యయసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగించిన ఉద్యమంలో వెయ్యిమందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోయినా, కనీస మద్దతు ధర కల్పించడం లేదని ధ్వజమెత్తారు. 2021లో లఖింపూర్ ఖేర్ హింసాత్మక సంఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ రైతుల మీదుగా కేంద్రమంత్రి కారు నడిపించారని ఆరోపించారు. ఆ కారులో కేంద్ర మంత్రి అజయ్ కుమార్ మిశ్రా తనయుడు ఆశిష్ మిశ్రా ఉన్నాడని పేర్కొన్నారు.. “ ఈ నాయకులు రైతుల మీదుగా కార్లు నడుపుతారని , 2014లో బీజేపీ అధికారం లోకి వచ్చిన దగ్గర నుంచి లక్ష మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. నిప్పులు చెరిగే ఎండల్లో ఎన్నికలు నిర్వహించడం ప్రజలను ఇబ్బంది పెట్టడమేనని విమర్శించారు. ఏదేమైనా ఓటర్లు భారీ సంఖ్యలో తరలి వచ్చి ఓటును వేయాలని కోరారు. ఈ ఓటు ప్రజల జీవితాలనే మారుస్తుందని, ఇదే ఓటు రాజ్యాంగాన్ని, ప్రజా స్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ఎస్‌పి నేత రామ్‌గోపాల్ యాదవ్ కూడా సైఫైలో ఓటు వేశారు. బీజేపీ మళ్లీ అధికారం లోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందన్నారు. బీజేపీ కొత్త రాజ్యాంగం కోసం సిద్ధమైందని, ఎవరైనా అధికారం లోకి వస్తే నియంతృత్వం దిశగా ముందుకు వెళ్తారని రామ్‌గోపాల్ విమర్శించారు.

## భారీ వర్షానికి హైదరాబాద్ నగరం గజగజ

హైదరాబాద్ జంట నగరాల పరిధిలోని పలుచోట్ల భారీ వర్షం కురుస్తోంది. ఎండలకు మండిపోయిన నగరం ఈ వర్షానికి చల్లబడింది. దీంతో నగర వాసులు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం లభించింది. నగరంలోని పంజాగుట్ట, ఫిలింనగర్, అమీర్ పేట్, మెహిదీపట్నం, టోలిచౌకి, గచ్చిబౌలి గోల్కొండ, కోఠి, ఉప్పల్, ఖైరాతాబాద్, ఎర్రగట్ట, కూకట్‌పల్లి, నిజాంపేట, కేపీహెచ్‌బీ, లిగంపల్లి, కొండాపూర్, మియాపూర్, సికింద్రాబాద్, బోయినపల్లి, తిరుమలగిరి, అల్వాల్, ప్యారడైజ్, మారేడ్‌పల్లి, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, సుచిత్ర, జీడిమెట్ల, బహదూర్‌పల్లి, పేట్‌బషీరాబాద్ మేడ్చల్ లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురుస్తోంది. ఎక్కడికక్కడ వర్షం నీరు నిలిచిపోయింది. వర్షం ధాటికి నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com